కెరమెరిలో రెండు సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవం

కెరమెరి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కెరమెరి మండలంలో ఈ నెల 11న జరిగే మొదటి విడత ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం 31 గ్రామ పంచాయతీలు ఉండగా ఇందులో రెండు సర్పంచ్ స్థానాలు ధనోర, బాబేఝురిలు ఏకగ్రీవం అయ్యాయి. మిగితా 29 గ్రామపంచాయతీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. 29 స్థానాలకు గాను 111 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. కాగా వార్డుస్థానాలు 250 కాగా 132 స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. మిగిలిన 118 స్థానాల్లో 222 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు.

పోలింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి


వీడియో కాన్ఫరెన్స్‌లక్ష పాల్గొన్న కలెక్టర్, అదనపు కలెక్టర్లు

ఆసిఫాబాద్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణికుముదిని సూచించారు. గురువారం హైదరాబాద్ నుంచి ఇతర ఎన్నికల కమిషనర్ సభ్యులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, కలెక్టర్లు, జిల్లా పంచాయతీ అధికారులతో పోలింగ్ ప్రక్రియ నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ మాట్లాడుతూ సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాల చివరి విడత నామినేషన్ల ప్రక్రియ సమర్థవంతంగా చేపట్టాలని తెలిపారు. మూడో విడుతలో నిర్వహించే ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలో గల వీసీ హాల్ నుంచి జిల్లా ఎన్నికల అధికారి వెంకటేష్ దోత్రే అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, డేవిడ్, ఆర్డీవో లోకేశ్వర్‌రావు, జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి, జడ్పీ సీఈవో లక్ష్మీనారాయణలతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 335 పంచాయతీలు, 2,874 వార్డు స్థానాలకు మూడు విడతలుగా ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పూర్తిస్థాయిలో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. చివరి విడత ఎన్నికల కోసం సర్పంచ్, వార్డు స్థానాలకు నామినేషనల ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. జిల్లాలో మూడు విడతల ఎన్నికల కోసం 87 జోన్లుగా ఏర్పాటు చేశామన్నారు. మండల ప్రత్యేకాధికారులు, జోనల్ అధికారులు, నోడల్ అధికారులు, తహసీల్దార్‌లు, ఎంపీడీవోలు, కార్యదర్శులు, పోలీసు శాఖ సమన్వయంతో ఎన్నికల ప్రశాంతంగా జరిగే విధంగా పర్యవేక్షిస్తున్నామని వివరించారు. సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నియంత్రణకు కృషి

- జిల్లా సంక్షేమాధికారి భాస్కర్


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జిల్లా సంక్షేమాధికారి భాస్కర్

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా బాల్య వివాహాల నియంత్రణే లక్ష్యంగా బాల్య వివాహ ముక్త్ భారత్ వంద రోజుల ప్రత్యేక కార్యక్రమాన్ని విజయవంతంగా అమలుచేస్తున్నట్లు జిల్లా సంక్షేమాధికారి డాక్టర్ భాస్కర్ తెలిపారు. కార్యక్రమంలో భాగంగా జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల సంరక్షణ విభాగం, షూస్ స్వచ్ఛంద సంస్థ సౌజన్యంతో రూపొందించిన అవగాహన పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ బాల్య వివాహం సమాజానికి మచ్చ వంటిదని ఇది బాలల శారీరక, మానసిక, విద్యా భవిష్యత్‌ను తీవ్రంగా దెబ్బతీస్తుందని పేర్కొన్నారు. బాల్య వివాహాల నిషేధ చట్టం ద్వారా ప్రభుత్వం కఠినమైన శిక్షలు విధిస్తోందన్నారు. ఈ విషయాన్ని ప్రజలకు చేరువ చేసేందుకే అవగాహన పోస్టర్లను జిల్లాలోని దేవాలయాలు, మసీదులు, చర్చి వంటి ప్రార్థన స్థలాల వద్ద ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. బాల్యవివాహాల నిషేధ చట్టం, ఫిర్యాదు చేసే విధానం, శిక్షల వివరాలపై ప్రజలకు స్పష్టమైన అవగాహన కలుగుతుందని అన్నారు. జిల్లా బాలల సంరక్షణాధికారి మహేష్ మాట్లాడుతూ షూస్ స్వచ్ఛంద సంస్థ సిబ్బంది, జిల్లా బాలల సంరక్షణ విభాగం సిబ్బంది సమన్వయంతో బాల్య వివాహాల నిర్మూలనకు అంకితభావంతో పని చేస్తున్నారని తెలిపారు. గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. బాలల హక్కుల పరిరక్షణలో కీలకపాత్ర పోషిస్తున్నారని వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బాల రక్ష భవన సిబ్బంది శ్రావణ్‌కుమార్, ప్రవీణ్‌కుమార్, నవీన్‌కుమార్, వెంకటేశ్వర్లు, షూస్ సంస్థ కో ఆర్డినేటర్ సంతోష్‌కుమార్, దేవాజీ, ప్రభు, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ ప్రాజెక్టులను పట్టించుకోని పాలకులు

- బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

కాగజ్‌నగర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సిర్పూరు నియోజకవర్గంలో పెండింగ్ ప్రాజెక్టులను పాలకులు పట్టించుకోవటం లేదని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ విమర్శించారు. గురువారం జగన్నాథ్‌పూర్ గ్రామాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో ఆయన మాట్లాడారు. జగన్నాథ్‌పూర్ ప్రాజెక్టు నిర్మాణం ఇంత వరకు పూర్తి కావటం లేదన్నారు. పాలకులు ఎవరు కూడా పట్టించుకోవటం లేదన్నారు. ఈ ప్రాజెక్టు పేరిట భూములను లాక్కున్నారన్నారు. ఇంత వరకు ఈ ప్రాజెక్టు పూర్తి కాలేదని మండిపడ్డారు. ఈయన వెంట స్థానిక నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి


ఐటీడీఏ ఇన్‌చార్జి ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మాట్

జైనూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని ఐటీడీఏ ఇన్‌చార్జి ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మాట్ అన్నారు. మండలంలోని రాశిమెట్ట బాలికల గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమోన్నత పాఠశాలతోపాటు భూసిమెట్ట గిరిజన గురుకుల కళాశాలను ఆయన గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రిజిస్టర్లు, తరగతి గదులను పరిశీలించారు. అదే విధంగా భోజన వసతి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య బలోపేతానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. విద్యార్థులకు గుణాత్మకమైన విద్య అందించవాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉన్నారు.

పటిష్ట నిఘా

- పల్లెపోరు నేపథ్యంలో జిల్లాలో చెక్‌పోస్టుల ఏర్పాటు
- తనిఖీలు ముమ్మరం చేసిన పోలీసుశాఖ
- సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక నిఘా
- మద్యం, డబ్బు తరలింపుపై దృష్టి

ఆసిఫాబాద్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరిపించేలా జిల్లా పోలీసు యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. జిల్లా సరిహద్దుల్లో భద్రతను కట్టుదిట్టం చేసింది. ఓటర్లను ప్రలోభ పెట్టే మద్యం, డబ్బు, ఇతర సామగ్రి జిల్లాలోకి రవాణ కాకుండా చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. చెక్‌పోస్టుల వద్ద పోలీసులు, ఇతర శాఖల అధికారుల సమన్వయంతో నిరంతరంగా తనిఖీలు ముమ్మరంగా చేపడుతున్నారు. జిల్లాలో మూడు దశల్లో ఈనెల 11, 14, 17 తేదీల్లో పంచాయతీ ఎన్నికలు జరుగనున్నాయి. ఇప్పటికే తొలి, మలివిడతల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ పూర్తి కాగా, తుది విడత ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు, తనిఖీలు నిర్వహిస్తున్నారు.


చెక్ పోస్టును తనిఖీ చేస్తున్న ఎస్పీ నితిక పంత్ (ఫైల్)

సరిహద్దుల్లో మూడు చెక్‌పోస్టుల ఏర్పాటు..

జిల్లాలోని ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ డివిజన్ల నుంచి మహారాష్ట్రకు రవాణా మార్గాలు ఉన్నాయి. వాంకిడి, సిర్పూర్-టి మండలం పోడ్సా, మాకిడి, చింతలమానేపల్లి మండలం గూడెం నుంచి మహారాష్ట్రలోని గ్రామాలకు వెళ్లొచ్చు, పోడ్సా, గూడెం వద్ద పెనుగాంగ, ప్రాణహిత నదులు సరి హద్దులుగా ఉన్నాయి. జిల్లాలో జరుగుతున్న పంచా యతీ ఎన్నికల నేపథ్యంలో అధికారులు వాంకిడి మండలంలోని జాతీయ రహదారిపై, సిర్పూర్-టి మండలంలోని వెంకట్రావ్‌పేట, దుబ్బగూడ వద్ద చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు.

ఒక్కో చెక్‌పోస్టులో రెవెన్యూ ఇన్ స్పెక్టర్, జూనియర్ అసిస్టెంట్ లేదా జీసీవోలు ఇద్దరు, మరో ఇద్దరు ఏఎస్ఐలు, లేదా పోలీసు సిబ్బంది, వీడియోగ్రాఫర్లు విధులు నిర్వహిస్తున్నారు. ఈ ఎన్నికల చెక్ పోస్టులతో పాటు చింతలమానేపల్లి మండలం గూడెం వద్ద అక్రమ రవాణా నియం త్రణకు చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. ఇటీవల సరిహద్దులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులను ఎస్పీ నితిక పంత్ తనిఖీ చేశారు. అలాగే మండలాల పరిధిలో ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది సైతం విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు.


వాహనాలను తనిఖీ చేస్తున్న పోలిసులు (ఫైల్)

సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక నిఘా..

జిల్లాలో సమస్యాత్మక కేంద్రాలపై పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఇప్పటికే సమస్యాత్మక, నెట్‌వర్క్‌లేని పోలింగ్ కేంద్రాలను గుర్తించి పోలింగ్ రోజు చేపట్టాల్సిన చర్యలపై కార్యాచరణ సిద్ధం చేశారు. నెట్‌వర్క్‌లేని పోలింగ్ కేంద్రాల్లో సూక్ష్మ పరిశీలకులను, సాధారణ పోలింగ్ కేంద్రాల్లో వెబ్ ఆధారంగా పోలింగ్ సరళిని పర్యవేక్షించేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో 335 పంచాయతీల్లో 2,874 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. నెట్‌వర్క్ లేని, సరైన రహదారులు లేని, మావోయిస్టు ప్రాబల్యం ఉన్న మారుమూల గ్రామాల్లో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. వీటిలో 151 పంచాయతీల పరిధిలో 1,346 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. ప్రత్యేక పోలీసు బలగాలను రంగంలోకి దించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. 57 పంచాయతీల పరిధిలో 342 కేంద్రాల్లో నెట్‌వర్క్ లేనట్లు గుర్తించారు. వీటిలో ఒక్కదానిలో ఒక సూక్ష్మ పరిశీలకుడిని నియమించారు. 101 పంచాయతీల పరిధిలోని 1,004 కేంద్రాలలో నెట్‌వర్క్ ఉండడంతో వాటిలో వెబ్‌కాస్టింగ్ ద్వారా పోలింగ్ సరళి పరిశీలించనున్నారు.

ఎంఈవో బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న సదాశివుడు

సిర్పూర్(టి), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సిర్పూర్(టి) ఎంఈవో వేణుగోపాల్ ఇటీవల పదవీవిరమణ పొందడంతో మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ప్రధానోపాధ్యాయుడు సదాశివుడుని ఇన్‌చార్జి ఎంఈవోగా ప్రభుత్వం నియమించింది. దీంతో ఆయన గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు ఆయనను అభినందించారు. కార్యక్రమంలో సీఆర్పీ పవన్‌కుమార్, ప్రవీణ్, సంతోష్ పాల్గొన్నారు.

చిరుత పులి కలకలం

సిర్పూర్(టి), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సిర్పూర్(టి) మండలంలోని కాగజ్‌నగర్- సిర్పూర్(టి) ప్రధాన రహదారిలో గల పెద్దబండ, తుర్కగుట్ట, వెంపల్లి రైల్వే పై ఓవర్ ప్రాంతాల్లో చిరుత పులి సంచారం కలకలం సృష్టిస్తోంది. బుధవారం రాత్రి వెంపల్లి ఫ్లైఓవర్ సమీపంలో వాహనదారులకు తారసపడగా, గురువారం సాయంత్రం మళ్లీ తుర్కగుట్ట వద్ద వాహనదారులకు చిరుత పులి కనిపిం చింది. దీంతో ఈ రహదారి గుండా ప్రయా ణించే వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. అటవీశాఖ సిబ్బంది సంఘటన స్థలానికి వెళ్లి చిరుత పాదము ద్ర లను గుర్తించారు. ఈ సందర్భంగా వాహనదారులు ఒక్కరుగా వెళ్ల వద్దని, గుంపులుగా వెళ్లాలని అధికారులు సూచిస్తున్నారు.

రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికల ప్రచారం

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికలలో బరిలో ఉన్న కాసుగంటి లక్ష్మణ్, చలకాని వెంకట్ యాదవ్ జిల్లా కేంద్రంలో స్థానిక బార్ అసోసియేషన్ సభ్యులతో గురువారం సమావేశం నిర్వహించి తమకు మద్దతు తెల పాల్సిందిగా కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు. బార్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గతంలో 10ప్లస్2 జిల్లా కోర్టుల నిర్మాణం కోసం వేయి కోట్ల రూపాయలు తెలంగాణ రాష్ట్రానికి ఇచ్చిందని జిల్లా కేంద్రంలో కోర్టు భవనాల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. 41 సీఆర్‌పీసీని అమలు చేయాలని న్యాయవాదుల పరిరక్షణ కోసం ప్రత్యేక చట్టాలు తీసుకువచ్చేలా రాష్ట్రస్థాయిలో నూతనంగా ఎంపికయ్యే కమిటీ చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆసిఫాబాద్, సిర్పూర్ బార్ అసోసియేషన్ న్యాయవాదులు రైస్ అహ్మద్, తాటిపల్లి సురేష్, ముక్తా సురేష్, వెంకటేశ్వర్లు, కిషోర్, శంకర్, జగన్‌మోహన్ రావు, శ్రీనివాస్, నికోడే రవీందర్, నరహరి, రాజీవ్‌రెడ్డి, చంద్రకుమార్ పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

- కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రెండో సాధారణ పంచాయతీ ఎన్నికలు జిల్లాలో ప్రశాంతంగా జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే సూచించారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ఎన్నికల సాధారణ పరిశీలకుడు శ్రీనివాస్, అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, డేవిడ్, సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లా, ఆర్డీవో లోకేశ్వర్‌రావులతో కలిసి సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికల నిర్వహణపై మండల ప్రత్యేక అధికారులు, నోడల్ అధికారులు, జోనల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సర్పంచ్, వార్డుసభ్యుల స్థానాలకు మూడు విడతలుగా ఎన్నికలు జరుగుతాయని మండల ప్రత్యేకాధికారులు, నోడల్ అధికారులు, జోనల్ అధికారులు సమన్వయంతో వ్యవహరించి ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో 335 గ్రామపంచాయతీలు, 2,874 వార్డు స్థానాలకు మూడు విడతల్లో 87 జోన్‌లుగా ఏర్పాటు చేయడం జరిగిందని, జోనల్ అధికారులు తమ పరిధిలోని పోలింగ్ కేందార్లను సందర్శించి రూట్ మ్యాప్, పోలింగ్ కేంద్రాలలో వసతులు, నెట్‌వర్క్‌పై నివేదికలు ఈ నెల 5వ తేదీలోగా సమర్పించాలని ఆదేశించారు. మొదటి విడుత ఎన్నికల్లో భాగంగా ఈ నెల 10వ తేదీన ఉదయం 9 గంటలకు ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాలకు రిపోర్టు చేసిన ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు వారికి సంబంధించిన పోలింగ్ కేంద్రాల ఎన్నికల సామగ్రి అందజేసి వారిని పోలింగ్ కేంద్రాలకు తరలించాలని తెలిపారు. ఈ నెల 11న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు పోలింగ్ నిర్వహించి మధ్యాహ్నం 2 గంటల నుంచి కౌంటింగ్ ప్రక్రియ చేపట్టాల న్నారు. ఫలితాలు వెలవరించి ఉప సర్పంచ్ ఎన్నికలు నిర్వహించి తిరిగి సిబ్బందిని స్వీకరించిన కేంద్రాలకు తీసుకు వచ్చే వరకు బాధ్యతా యుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పన, భోజన ఏర్పాట్లు చూడాలని తెలిపారు. మండల ప్రత్యేకాధికారులు తమ మండలంలో పంపిణీ కేంద్రం వద్ద ఏర్పాట్లు, ఎన్నికల సిబ్బందికి భోజన వసతి, అల్పాహారం ఏర్పాట్లను పర్యవేక్షించాలని ఆదేశించారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

నోడల్ అధికారులు ఎన్నికల సామగ్రి సిబ్బందికి శిక్షణ, వాహనాల ఏర్పాట్లు పర్యవేక్షించాలన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేసి జిల్లాలో ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేలా చర్యలు తీసు కోవాలని తెలిపారు. సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి, జడ్పీ సీఈవో లక్ష్మీనారాయణ, మండల అధికారులు, నోడల్ అధికారులు, జోనల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజు ఊపందుకున్న నామినేషన్ల పర్వం

కాగజ్‌నగర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మండలంలో మూడో దశ పోలింగ్ నామినేషన్ ప్రక్రియలో భాగంగా రెండోరోజు నామినేషన్లు ఊపందుకున్నాయి. ఆయా ప్రధాన పార్టీల నాయకులు తమ బలపరుస్తున్న అభ్యర్థులకు మద్దతుగా వచ్చారు. దరిగాం నుంచి బరిలో ఉంటున్న అభ్యర్థి టేకం కన్నయ్యకి మద్దతుగా బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ నామినేషన్ కేంద్రానికి వచ్చారు. అలాగే కోసిని గ్రామ పంచాయతీకి చెందిన వెంకన్న కూతురు దీపిక హైదరాబాద్‌లో బీటెక్(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) నాలుగో సంవత్సరం విద్యార్థిని నామినేషన్ వేసింది.


నామినేషన్ వేసేందుకు వచ్చిన దరిగాం గ్రామస్థులు



బీటెక్ విద్యార్థిని దీపిక, వడాయి సుశీల

కలిసొచ్చిన రిజర్వేషన్..

కాగజ్‌నగర్ మండలం దరిగాం గ్రామ పంచాయతీ బీసీలకు రిజర్వ్ అయింది. ఈ గ్రామంలో ఉన్న బీసీ కుటుంబం ఒకే ఉండటం విశేషం. ఈ కుటుంబం నుంచి వశాకే సుశీలను ఉంచేందుకు గ్రామస్థుల తీర్మానం చేసుకున్నారు. గురువారం ఉదయం నామినేషన్ కేంద్రానికి చేరుకున్నారు. గ్రామస్థులందరి సమక్షంలో సర్పంచ్ స్థానానికి ఒకే నామినేషన్, ఎనిమిది మంది వార్డు సభ్యులతో నామినేషన్ దాఖలు చేశారు. ఇతరులెవరు కూడా వేసేందుకు అవకాశం లేకపోవటంతో ఇక్కడి గ్రామపంచాయతీ సర్పంచి ఏకగ్రీవం అయింది. సుశీలది నిరూపేద కుటుంబం. ప్రస్తుతం కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. వీరి కుటుంబ అంతా కూడా కౌలు వ్యాపారం చేసుకుంటూ కాలం వెళ్లదీస్తున్నారు. అనూహ్యంగా రిజర్వేషన్ బీసీలకు కేటాయించడం గ్రామంలో ఒకే కుటుంబ ఉండటంతో సర్పంచిగా వశాకే సుశీల ఏకగ్రీవం కానుంది.

బాలుడి హత్య కేసులో ఇద్దరికి జీవిత ఖైదు

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): తిర్యాణి మండలం ఉల్లపిట్ట గ్రామానికి బాలుడిని హత్య చేసిన కేసులో ఇద్దరికి జీవిత ఖైదు విధిస్తూ గురువారం ప్రిన్సిపల్ సెషన్ కోర్టు న్యాయమూర్తి ఎంవీ రమేష్ తీర్పును వెలవరించినట్లు జిల్లా ఎస్పీ నితికా పంత్ తెలిపారు. గురువారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘటన వివరాలను వెల్లడించారు. ఉల్లిపిట్ట గ్రామానికి చెందిన అరుణబాయికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. పెద్ద కుమార్తె వివాహం కాగా కుమారుడు దుర్గం ఉదయ్‌కిరణ్ ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. రెండో కుమార్తె శ్రీదేవిని అదే గ్రామానికి చెందిన బోర్కుంట తరుణ్ ప్రేమపేరుతో వేధింపులకు గురి చేస్తుండగా తన కూతురిని ఇబ్బంది పెట్టొద్దని తల్లి పలుమార్లు హెచ్చరించింది. అయినా తరుణ్ వినకుండా వేధింపులను కొనసాగించాడు. ఈ నేపథ్యంలో కుటుంబసభ్యులు శ్రీదేవిని బంధువుల ఇంటికి పంపించినా అక్కడకు వెళ్లి తరుణ్ వేధించాడు. 2023 జూన్ 1న అరుణబాయి ఉపాధిహామీ పని నిమిత్తం వెళ్లగా అదను చూసి ఇంట్లో నిద్రిస్తున్న బాలుడు ఉదయ్‌కిరణ్‌పై తరుణ్ మరో వ్యక్తి నరున్‌కుమార్‌తో కలిసి గొంతు నొక్కి హత్య చేశారు. ఘటనపై బాలుడి తల్లి అరుణబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు తిర్యాణి ఎస్సై రమేష్ కేసు నమోదు చేయగా తదుపరి దర్యాప్తు రెబ్బెన సీఐ అల్లం నరేందర్ కొనసాగించారు. కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ జగన్మోహన్‌రావు సాక్షులను కోర్టులో ప్రవేశ పెట్టగా నేరం రుజువు కావడంతో ప్రిన్సిపల్ సెషన్ కోర్టు న్యాయమూర్తి ఎంవీ రమేష్ నిందితులపై శిక్షలను ఖరారు చేశారు. ఏ1 బోర్కుంట తరుణ్‌కు జీవిత ఖైదుతో పాటు 28 వేల రూపాయల జరిమానా, ఏ2 దుర్గం నరుణ్‌కుమార్‌కు జీవిత ఖైదుతో పాటు 26 వేల రూపాయల జరిమానా విధించారు. నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన ప్రస్తుత తిర్యాణి ఎస్సై వెంకటేష్, రెబ్బెన సీఐ సంజయ, ఆసిఫాబాద్ ఏసీపీ చిత్తరంజన్, సీడీవో అండ్ కోర్టు లైజనింగ్ ఆఫీసర్ ఏఎస్సై రాంసింగను ఎస్పీ నితికా పంత్ అభినందించారు.

వైభవంగా దత్త జయంతి

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో గురువారం నిర్వహించిన దత్త జయంతి వేడుకలు వైభవంగా సాగాయి. ఉదయం పల్లకీ సేవతో ప్రారంభమైన వేడుకలు, మధ్యాహ్నం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల ఆవరణలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ఆలయంలో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి, సోనేరావు దంపతులు పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ సందర్భం గా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లా ప్రజలపై దేవుడి ఆశీసులు ఉండి సమగ్ర అభివృద్ధి సాగాలని ఆకాంక్షించినట్లు తెలిపారు. ఆలయ పూజారి మధుకర్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. దత్త జయంతి పురస్కరించుకొని ఆలయాలు భక్తులతో కిక్కిరిసాయి. సాయంత్రం దీపారాధనతో వేడుకలు ముగిశాయి. కార్యక్రమంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.


సాయిబాబా ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి దంపతులు

ఘనంగా పల్లకి శోభాయాత్ర

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో తొమ్మిది రోజుల నుంచి నిర్వహించిన దత్తసాయి నవరాత్రి ఉత్సవాలు ముగిం పులో భాగంగా గురువారం ఆలయ నిర్వహకులు పల్లకీ శోభాయాత్ర నిర్వహించారు. పేట్‌మహిళ, బెస్తవాడ, రైల్వేస్టేషన్, బస్టాండు తదితర ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. దీంతో కాలనీల్లో మహిళలు హారతులతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సిర్పూర్(టి) ఎస్సై సురేష్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.


శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడులు


గుడుంబాను ధ్వంసం చేస్తున్న పోలీసులు

కాసిపేట, డిసెంబరు 4 (ఆంధ్ర జ్యోతి): దేవాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని లంబాడితండా(డీ) గ్రామ శివారు ప్రాంతంలో గురువారం దేవాపూర్ పోలీసులు గుడుంబా స్థావరాలపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో వెయ్యి లీటర్ల బెల్లం పానకం, 200 లీటర్ల గుడుంబాను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా లంబాడితండా(డీ) గ్రామంలోని ప్రజలకు, యువకులతో దేవాపూర్ ఎస్‌ఐ గంగారాం మాట్లాడారు. నిబంధనలకు విరుద్ధంగా గుడుంబా తయారు చేసినా, అమ్మకాలు చేపట్టిన కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. యువత మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని, చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు.

వండిన అడవిపంది మాంసం పట్టివేత

నెన్నెల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నార్వాయిపేటలో ఫారెస్టు అధికారులు గురువారం వండిన అడవిపంది మాంసాన్ని పట్టుకున్నారు. అటవీ ప్రాంతంలో వన్యప్రాణులను వేటాడినట్టు అందిన పక్కా సమాచారంతో అనుమానితుల ఇళ్లలో సోదాలు చేపట్టారు. ఒకరి ఇంట్లో వండిన అడవిపంది మాసం లభించగా స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు విచారణ చేపడుతున్నామని, ఎవరు వేటాడారు.. మాంసాన్ని ఎంత మంది పంచుకున్నారో అనే కోనంలో విచారణ చేపడుతున్నామని బెల్లంపల్లి ఫారెస్ట్ రేంజ్ అధికారి పూర్ణచందర్‌రావు పేర్కొన్నారు. విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

కత్తితో మహిళపై దాడి


కన్నెపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బుధవారం రాత్రి కత్తితో మహిళపై దాడి జరిగింది. కన్నెపల్లి ఎస్‌ఐ భాస్కర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం కన్నెపల్లిలోని వాటర్ ట్యాంకు దగ్గర పిట్టల శేఖర్, సికిన భీమేష్, అతివల సురేష్ అనే ముగ్గురు చలి మంట కాగుతున్నారు. ఈ క్రమంలో పిట్టల శేఖర్‌కు సురేష్ కుమార్తెతో గొడవ జరిగింది. దీంతో సురేష్ చాకుతో దాడికి పాల్పడడంతో అక్కడే ఉన్న అతివల మల్లేష్ ఆపేందుకు ప్రయత్నించగా మల్లేష్ చేతికి గాయాలయ్యాయి. ఇదే క్రమంలో శేఖర్‌పై దాడికి ప్రయత్నించగా పిట్టల రమ్య అనే మహిళ తన సోదరుడైన శేఖర్‌ను కాపాడుకునే ప్రయత్నంలో సురేష్ తన చేతిలోని కత్తితో ఆమెపై దాడి చేయడంతో రమ్య చేతికి తీవ్ర గాయాలయ్యాయి. అదే రాత్రి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా వైద్యం నిమిత్తం బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి 108 వాహనంలో తరలించినట్లు తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన


యువకులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న పోలీసులు

లక్షెట్టిపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో సైబర్ నేరాలపై పోలీసులు గురువారం సాయంత్రం యువకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎస్సై అన్వర్ మాట్లాడుతూ మొబైల్ ఫోన్‌లకు తెలియని లింక్ నుంచి మెసేజ్‌లు వస్తే వాటిని ఎట్టి పరిస్థితుల్లో ఓపెన్ చేయవద్దన్నారు. ముఖ్యంగా కొన్ని బ్యాంక్ లోగోలతో ఏపీకే ఫైల్‌స వస్తున్నాయని ఏమైన బ్యాంకు లావాదేవీలు ఉంటే నేరుగా బ్యాంకు అధికారుల వద్దకు వెళ్లి సంప్రదించాలని సూచించారు. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి అడిగితే ఓటీపీ, పిన్‌లు చెప్పవద్దని సూచించారు. ఏవైన మోసాలకు గురైతే వెంటనే 1930 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. సైబర్ నేరాల విషయంలో అప్రమత్తంగా ఉంటామని యువకులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఏఎస్సై వెంట పీసీలు సుధాకర్, ప్రేమ్, రాజమౌళి ఉన్నారు.

అన్ని పార్టీలకు అగ్ని పరీక్ష



- పంచాయతీ ఎన్నికల్లో మద్దతు కోసం ప్రధాన పార్టీ నాయకులపై ఒత్తిడి పెంచుతున్న ఆశావహులు
- తలలు పట్టుకుంటున్న నాయకులు, రాజీ కోసం చర్చలు
- ఉపసంహరణ వరకు చూద్దాం
- గెలుపు గుర్రాలకే జై కొట్టేందుకు సిద్ధమవుతున్న నాయకులు

కాగజ్‌నగర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికలు కాగజ్‌నగర్ మండలంలో మూడో విడత ఉన్న నేపథ్యంలో ఇప్పుడు అందరి దృష్టి ఈ మండలంపైనే పడింది. అన్ని రాజకీయ పార్టీలకు ఈ మండలం ఇప్పుడు అగ్ని పరీక్షగా మారింది. ప్రధాన పార్టీల నాయకులంతా కూడా ఇక్కడే ఉండటంతో ఎవరికి మద్దతు తెలుపుతారోనని ఉత్కంఠ నెలకొన్నది. అన్ని పార్టీల్లోనూ వర్గపోరు ఉండటంతో ప్రధాన నాయకులపై తీవ్ర ఒత్తిడి పెరుగుతోంది. చోటామోటా నాయకులు ఏకంగా హైదరాబాద్ నుంచి ఆయా పార్టీలకు చెందిన అగ్రనాయకులతో ఇక్కడి నాయకులకు ఫోన్లు చేయిస్తున్నారంటే పోటీ ఎంత తీవ్రత ఉందో ఇట్టే ఊహించుకోవచ్చు. పట్టున్న ప్రాంతాల్లో ఏకగ్రీవం చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ అవి ఫలించటం లేదు. పది రోజులుగా బరిలో ఉండే ఆశావహులు తమ నాయకుల ఇళ్ల ఎదుట ఉదయం నుంచి ఉంటున్నారు. కుల సంఘాల నాయకులతో ఫోన్లు చేయిస్తున్నారు.

కూతవేటు దూరంలోనే...

కోసిని, బురుదగూడ, వంజీరి, చింతగూడ, నజ్రూల్ నగర్ గ్రామ పంచాయతీలు పట్టణానికి కూత వేటు దూరంలో ఉండటం, ప్రధాన పార్టీల అగ్రనాయకులంతా కూడా వీరికి అందుబాటులో ఉంటున్నారు. వారం రోజులుగా ఆశావహులతో రాజీకి చర్చలు చేస్తున్నారు.

బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ పంచాయతీ ఎన్నికల్లో తమ పట్టు చూయించాలని శతవిధాల ప్రయత్నాలు చేస్తున్నారు. పక్కాగా గెలుపు ఉండే అభ్యర్థులకు మద్దతు తెలిపేందుకు అంతా సిద్ధం చేస్తున్నారు. ఇక బీఆర్‌ఎస్‌కే చెందిన మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఎవరు గెలుస్తారు..? ఎవరు ఓడుతారనే అనే అంశంపై క్షేత్రస్థాయిలో వాకబు చేస్తున్నారు. పక్కాగా గెలిచే అభ్యర్థుల కోసం వ్యూహ రచన చేస్తున్నారు. బీఆర్‌ఎస్ పార్టీ మద్దతు ఎవరికి ఉంటుందనే అంశంపై అంతా చర్చించుకుంటున్నారు. కాగా ఎవరికి వారే అడుగులు వేస్తుండటంతో పార్టీ నాయకులు అయోమయంలో ఉన్నారు.

ఇక బీజేపీలో సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు తనకున్న క్యాడర్‌తో అడుగులు వేస్తున్నారు. తమ మద్దతుతో కాగజ్‌నగర్ మండలంలో బోణీ కొట్టేందుకు పక్కా ప్రణాళిక వేస్తున్నారు.

అధికార పార్టీ కాంగ్రెస్‌లో ఎమ్మెల్సీ దండే విఠల్ పూర్తి స్థాయిలో పర్యవేక్షిస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు చర్చలు జరుపుతున్నారు. గెలిచే అభ్యర్థులకు పక్కా మద్దతు తెలిపేందుకు అడుగులు వేస్తున్నారు. పోటీ ఉండే చోటా కూడా ఎవరికి మద్దతు ప్రకటించాలన్న అంశంపై చర్చలు జరుపుతున్నారు. మూడో విడత కాగజ్‌నగర్ మండలంలో కొనసాగనుండటంతో ఎలాంటి తప్పిదాలు జరగకుండా పక్కాగా ప్రణాళిక రచిస్తున్నారు. బడా నాయకులంతా కూడా కాగజ్‌నగర్‌లోనే మకాం వేసి తమ మద్దతుదారులను గెల్పించుకునేందుకు అడుగులు వేస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



జన్నారం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కవ్వాల టైగర్ జోన్‌లోని జన్నారం అటవీ డివిజన్ పరిధిలో గల బర్దన్‌పేట సెక్షన్‌లో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను అధికారులు గురువారం పట్టుకున్నారు. ఫారెస్టు డివిజనల్ అధికారికి పక్కా సమాచారం మేరకు ట్రాక్టర్ పట్టుకొని రేంజ్‌కు తరలించినట్లు ఇందన్‌పల్లి ఎఫ్‌ఆర్‌వో లక్ష్మీనారాయణ తెలిపారు. కవ్వాల్ టైగర్‌జోన్‌లోని ఇసుక అక్రమంగా తరలించినా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ఎఫ్ఎస్‌వో హన్మంతరావు, ఎఫ్‌బీవో రుబీనా ఉన్నారు.

జీడీకే 2ఏ ఇంక్లైన్‌లో ప్రమాదం

ఇద్దరు కార్మికులకు గాయాలు

గోదావరిఖని, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆర్‌జీ-1 పరిధిలోని జీడీకే2ఏ ఇంక్లైన్‌లో గురువారం రెండవ షిఫ్టులో జరిగిన ప్రమాదంలో ఇద్దరు కార్మికులు గాయపడ్డారు. మ్యాన్ రైడింగ్ చానల్స్‌కు మరమ్మతులు నిర్వహిస్తుండగా చక్రాలు ఊడిపోయి సునింద్ర, మహేందర్‌రెడ్డి అనే జనరల్ అసిస్టెంట్ల చేతులపై పడడంతో చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని గోదావరిఖని సింగరేణి ఏరియా ఆసుపత్రికి తరలించగా మహేందర్‌రెడ్డి తీవ్రంగా గాయపడగా అతనిని మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించారు. ప్రమాదంపై అధికారులు విచారణ జరుపుతున్నారు.

పల్లె పాలనకు 61 ఏళ్లు

- 1964లో తొలిసారిగా పంచాయతీ ఎన్నికలు
- అప్పట్లో పరోక్ష పద్ధతిలో సర్పంచ్‌ల ఎన్నిక
- 1978 నుంచి ప్రత్యక్ష పద్ధతి



మంచిర్యాల/వాంకిడి డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పల్లెల్లో పాలన ప్రారంభమై ఆరు దశాబ్దాలు గడుస్తోంది. ప్రజాస్వామ్య వ్యవస్థకు మూలస్తంభమైన గ్రామపంచాయతీల ఏర్పాటు, అనంతరం చోటు చేసుకున్న మార్పులు ఆసక్తికరంగా ఉన్నాయి. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత పంచాయతీ రాజ్ సంస్థల ఏర్పాటు కోసం 1957లో భారత ప్రభుత్వం బల్వంతరాయ్ మెహతా కమిటీని నియమించింది. ఈ కమిటీ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం మూడంచెల వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించింది. జాతీయ అభివృద్ధి సంస్థ 1958లో ఆమోదించింది. మూడంచెల విధానంలో గ్రామపంచాయతీ, పంచా యతీ సమితి, జిల్లా పరిషత్ వ్యవస్థలు ఉన్నాయి. 1958లో ఆమోదం తెలపడంతో అప్పటి కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర పంచా యతీరాజ్ సంస్థల చట్టం ఏర్పాటు చేసింది. దీనిని మొట్టమొదటిగా రాజస్థాన్ రాష్ట్రం అమలు చేయగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ 1959 అక్టోబరు 2న అమలు చేసింది.

పరోక్ష పద్ధతిలో ఎన్నికలు...

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 1964లో సమగ్ర గ్రామపంచాయతీల చట్టాన్ని రూపొందించారు. ఈ చట్టం ప్రకారం 500పైగా జనాభా ఉన్న గ్రామాలను ఒక పంచాయతీగా ఏర్పాటు చేశారు. జనాభా ఆధారంగా ఐదు నుంచి 17 మంది వరకు వార్డు సభ్యులు ఉండవచ్చునని పేర్కొన్నారు. 1964లో సర్పంచ్ ఎన్నికలు తొలిసారిగా పరోక్ష పద్ధతిలో జరిగాయి. వార్డు సభ్యులను ఓటర్లు ఎన్నుకుంటే వార్డు సభ్యులు సర్పంచ్‌ను ఎన్నుకునేవారు. ఎన్నికైన సర్పంచ్‌లు కలిసి సమితి ప్రెసిడెంట్‌ను ఎన్నుకునేవారు. సమితి ప్రెసిడెంట్లు జిల్లా పరిషత్ అధ్యక్షుడిని, ఉపాధ్యక్షుడిని ఎన్నుకునేవారు. 1976 వరకు ఇదే పద్ధతి కొనసాగగా సమితి ప్రెసిడెంట్ ఎన్నికల్లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు కూడా ఓటు హక్కు ఉండేది. అనంతరం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1978లో నర్సింహం కమిటీని ఏర్పాటు చేయగా సర్పంచ్‌లను ప్రత్యక్ష పద్ధతిలో ఎన్నుకోవాలని కమిటీ సూచించింది. దీంతో అప్పటి నుంచి సర్పంచ్ ఎన్నిక ప్రక్రియ ప్రత్యక్ష పద్ధతిలోనే నిర్వహిస్తున్నారు.

1986 నుంచి మండల వ్యవస్థ

తాలూకా పరిధిలో ఉండే పంచాయతీ సమితుల వల్ల గ్రామీణ ప్రజలకు ప్రభుత్వ సేవలు అందుబాటులో ఉండడంలేదని భావించి 1986లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎం ఎన్టీఆర్ మండల వ్యవస్థను తెచ్చారు. పంచాయతీ సమితులు రద్దయి 1987 మార్చి 2 నుంచి మండల వ్యవస్థ అమల్లోకి వచ్చింది. 1987లో తొలిసారి మండల పరిషత్ ఎన్నికలు జరిగాయి. ఈ వ్యవస్థలో మండల అధ్యక్షులను నేరుగా ఓటర్లే ఎన్నుకున్నారు. అప్పుడు ఎంపీటీసీల వ్యవస్థ లేనందున సర్పంచ్‌లు మండల పరిషత్ సభ్యులుగా ఉండేవారు. సర్పంచులు మండల ఉపాధ్యక్షుడిని, ఎంపీపీలు జిల్లా పరిషత్ చైర్మన్‌ను, వైస్ చైర్మన్‌ను ఎన్నుకునేవారు.

రిజర్వేషన్లు అమలు

1992లో అమల్లోకి వచ్చిన 73వ రాజ్యాంగ సవరణతో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని 1/3 వంతు మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలని సూచించింది. అప్పటి నుంచి గ్రామ పంచాయతీ, మండల, జిల్లా పరిషత్‌లలో రిజర్వేషన్లు అమలు అవుతున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ చట్టం 1994ద్వారా గ్రామపంచాయతీ, మండల ప్రజాపరిషత్, జిల్లా ప్రజా పరిషత్ వ్యవస్థను ఏర్పాటు చేసింది. 2009లో మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం రాజ్యాంగంలోని ఆర్టికల్ 243(డి) సవరించడం ద్వారా స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలకు 33 శాతం ఉన్న రిజర్వేషన్లను 50 శాతానికి పెంచింది. అప్పటి నుంచి మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు అమలవుతున్నాయి.

ఆనందాపూర్ శివారులో పులి సంచారం

కన్నెపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆనందాపూర్ గ్రామ శివారులోని పెద్ద చెరువు సమీపంలో గురువారం పులి సంచరించిందని గ్రామస్థులు తెలిపారు. గ్రామంలోకి వచ్చి పంట పొలాల్లో తిరిగి వెళ్లినట్లు తెలిపారు. పెద్దపులి అడుగులు చూసినా ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. గురువారం ఉదయం పెద్ద చెరువు సమీపంలో పెద్దపులి అడుగులను చూసిన గ్రామస్థులు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. అటవీ అధికారులు వచ్చి పరిశీలించి పులి అడుగులుగా నిర్ధారించారు. ఆనందాపూర్, మెట్‌పల్లి, నా యకునిపే, లింగాల, జక్కెపల్లి, బుయ్యారం, నాగారం, సూరారం, తదితర గ్రామాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని కుష్నపల్లి ఎఫ్‌ఆర్‌వో దయాకర్ సూచించారు. పులి ఎటు వెళ్లిందని అడుగుల ద్వారా గుర్తిస్తున్నామని తెలిపారు. పులికి ఎలాంటి హానీ చేయవద్దని ఆయన పేర్కొన్నారు.

విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో పొలంబాట



దహెగాంలో అవగాహన కల్పిస్తున్న విద్యుత్ శాఖ సిబ్బంది

దహెగాం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): టీఎస్ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి ఆదేశాల మేరకు గురువారం దహెగాం మండలంలోని రైతులకు విద్యుత్ శాఖ అధికారులు పొలం బాట నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మోటార్ల దగ్గర ప్రమాదాలు జరగకుండా ఎర్తింగ్ చేసుకోవాలని, జాగ్రత్తలు పాటించాలని, కేపాసిటర్లు బిగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ సిబ్బది జనార్ధన్, లైన్ ఇన్‌స్పెక్టర్ పురుషోత్తం, రైతులు వెంకటి, వెంకన్న, సత్తన్న, బాబాజీ, రామన్న తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు టీబీజీకేఎస్ నాయకుల పరామర్శ

శ్రీరాంపూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఉద్యోగులకు టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. సురేందర్ రెడ్డి ఆధ్వర్యంలో రామకృష్ణాపూర్ ఏరియా ఆస్పత్రిలో గురువారం పరామర్శించారు. కోల్ ఇండియా స్థాయి కబడ్డీ పోటీల్లో గాయపడిన సింగరేణి జట్టు కెప్టెన్ కార్తీక్‌తో పాటు వేర్వేరు గని ప్రమాదాల్లో గాయపడిన కార్మికులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు బండి రమేష్, నాయకులు పానుగంటి సత్తయ్య, పొగాకు రమేష్, అన్వేష్ రెడ్డి, గడ్డం మహిపాల్ రెడ్డి, జైపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మహా పడిపూజ వాల్‌పోస్టర్ విడుదల

శ్రీరాంపూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత అయ్యప్ప ధర్మ ప్రచార సభ(ఏబీఏపీ) శ్రీరాంపూర్ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీన శ్రీరాంపూర్‌లోని ప్రగతి మైదానంలో నిర్వహించనున్న అయ్యప్ప స్వాముల సామూహిక మహా పడిపూజ కార్యక్రమ పోస్టర్‌ను అల్‌ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి నరేందర్ రెడ్డి మంచిర్యాలలో గురువారం విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడతూ, శ్రీరాంపూర్ కాలనీ ప్రగతి స్టేడియంలో ఈ నెల 8వ తేదీన అయ్యప్ప స్వాముల మహా సంగమం, మహా పడిపూజ మహోత్సవం, అయ్యప్ప స్వాములతో అగ్నిప్రవేశం (అగ్ని గుండాలు) నిర్వహించనున్నట్లు తెలిపారు. అయ్యప్పస్వాములు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మల్లెత్తుల రాజేంద్రపాణి, ఏబీఏపీ శ్రీరాంపూర్ ఏరియా వర్కింగ్ ప్రెసిడెంట్ వంగ శివకుమార్, అధ్యక్షుడు బొడ్డు లక్ష్మణ్, ఉపాధ్యక్షుడు చకిలం శ్రావణ్, తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగులకు పింఛన్ రూ. పదివేలు ఉండాలి

- పార్లమెంటులో ప్రస్తావించిన పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ



మందమర్రిటౌన్/శ్రీరాంపూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థలో మూడు నుంచి నాలుగు దశాబ్దాల పాటు పనిచేసి సంస్థ అభివృద్ధికి పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు కనీసం రూ.10 వేల పింఛన్ ఇవ్వాలని దీనికి సంబంధించి కేంద్రం చర్యలు తీసుకునే విధంగా చూడాలని పెద్దపల్లి పార్లమెంటు సభ్యుడు గడ్డం వంశీకృష్ణ పేర్కొన్నారు. గురువారం పార్లమెంటు సమావేశాల్లో ఆయన రిటైర్డ్ సింగరేణి ఉద్యోగుల పింఛన్ విధానంపైన చర్చించారు. తెలంగాణలో అతిపెద్ద పరిశ్రమ అయిన సింగరేణిలో వేలాది మంది రిటైర్డ్ ఉద్యోగులకు కనీసం పింఛన్ రూ.500 నుంచి వెయ్యి, 1500 రూపాయలు మాత్రమే ఉందని దీంతో వారి కుటుంబాల మనుగడ ఎలా సాగుతుందని ప్రశ్నించారు. చాలా మంది రిటైర్డ్ ఉద్యోగులు ఈ పెన్షన్ పెంపుదలకు సంబంధించి పదేపదే ప్రజాప్రతినిధులకు, అధికారులకు మొరపెట్టుకుంటున్నారని అయినా కనీస స్పందన ఉండడం లేదన్నారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న పార్లమెంటు పరిధిలో రిటైర్డ్ కార్మికుల సంఖ్య అధికంగా ఉందన్నారు. గతంలో తన తాత కేంద్ర మాజీమంత్రి దివంగత కాకా వెంకటస్వామి దేశవ్యాప్తంగా ఉన్న ఉద్యోగులకు పెన్షన్లు మంజూరు చేయించారని తెలిపారు. ప్రస్తుతం కనీస పెన్షన్ పెంపుదల 10వేలు ఉండేలా కేంద్రం తక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. మానవీయ కోణంలో పరిశీలించాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఉద్యోగులకు మెరుగైన సేవలు అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జీఎం రాధాక్రిష్ణ

మందమర్రిటౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో పని చేస్తున్న ప్రతీ ఉద్యోగికి సీఎంపీఎఫ్ పెన్షన్‌లకు సంబంధించి మెరుగైన సేవలు అందించేందుకు సంబంధిత శాఖ అధికారులు కృషిచేయాలని సీఎంపీఎఫ్ రీజనల్ కమిషనర్ గోవర్ధన్, జీఎం రాధాక్రిష్ణ తెలిపారు. గురువారం స్థానిక జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్‌లో సీఎంపీఎఫ్ పెన్షన్‌లకు సంబంధించి సమీక్ష సమావేశంలో వారు మాట్లాడారు. సీఎంపీఎఫ్ పెన్షన్లకు సంబంధించిన లావాదేవీలను సీకేర్స్ పోర్టల్ ద్వారా మాత్రమే జరుగుతున్నట్లు తెలిపారు. కొత్తగా సీఎంపీఎఫ్ పెన్షన్‌కు సంబందించిన క్లైమ్స్ త్వరగా పూర్తిచేయడానికి ప్రయాస్ పద్దతిని తీసుకొచ్చామన్నారు. బొగ్గు మంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు జీరో పెండింగ్ సీఎంపీఎఫ్ పెన్షన్ సంబంధించిన క్లైమ్‌లను సెటిల్ చేస్తున్నామన్నారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా సీఎంపీఎఫ్ సేవలను ఉద్యోగులు పారదర్శకంగా పొందవచ్చునని తెలిపారు. ఉద్యోగులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఏమైన సమస్యలు ఉంటే ఉద్యోగులు కూడ సంబంధిత గనుల డిపార్టుమెంట్ల వద్ద అధికారులను సంప్రదించి పరిష్కరించుకోవచ్చునని పేర్కొన్నారు. సింగరేణి ఉద్యోగుల నిఖర నిధి పెన్షన్లకు సంబంధించి వేగవంతమైన పనులు చేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. ఎస్‌ఓటు జీఎం లలితా ప్రసాద్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ శంకర్, సీఎంపీఎఫ్ రీజనల్ ఆఫీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలకు త్వరలో పరిష్కారం

శ్రీరాంపూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల సమస్యలు త్వరలో పరిష్కరిస్తామని రామగుండం సీఎంపీఎఫ్ కమిషనర్-2 గోవర్ధన్, శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్ అన్నారు. ప్రయాస్ కార్యక్రమంలో భాగంగా శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంల వారు మాట్లాడారు. ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగి పీఎఫ్, పెన్షన్ సెటిల్‌మెంట్ కోసం సీ-కేర్స్ సాఫ్ట్‌వేర్‌ను అందుబాటులోకి తెచ్చామన్నారు. దీని ద్వారా పెండింగ్ సమస్యలను జీరోకి తీసుకువస్తామన్నారు. ఏరియాలో ఉన్న అన్ని పెండింగ్ సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు సీఎంపీఎఫ్ కమీషనర్ సమావేశానికి వచ్చినట్లు జీఎం చెప్పారు. అన్ని గనుల సంక్షేమాధికారులు, కార్యాలయ సిబ్బంది రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమం పట్ల బాధ్యతగా వ్యవహరించాలన్నారు. రానున్న రోజుల్లో జీరో పెండెన్సీ లక్ష్యంగా పనిచేస్తామని అన్నారు. అనంతరం 1332 రివైజ్డ్ పెన్షన్ పేమెంట్ ఆర్డర్లు అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఓ టు జీఎం సత్యనారాయణ, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, డీజీఎం(పర్సనల్) అనిల్ కుమార్, సీనియర్ పీవో సురేందర్, పిట్ కార్యదర్శి సందీప్, అన్ని గనుల సంక్షేమాధికారులు, సిబ్బంది, సీఎంపీఎఫ్ కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



జీఎంకు పీపీవో ఆర్డర్స్ అందిస్తున్న సీఎంపీఎఫ్ కమిషనర్



ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలి


గనిపై మాట్లాడుతున్న నాయకులు

శ్రీరాంపూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రమాదాలు జరుగకుండా జాగ్రత్తలు పాటించాలని ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి కందికట్ల వీరభద్రయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీసైదా అన్నారు. గురువారం వారు ఆర్కే 7 గనిని సందర్శించి కార్మికుల సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ, గనిలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటి నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. బుధవారం ఉదయం జరిగిన ప్రమాదంలో ఎస్‌డీఎల్ కేబుల్ తాకి శ్రీనివాస్ అనే కార్మికుడికి గాయాలయ్యాయన్నారు. దీనికి ప్రధాన కారణం ఒకే లెవల్‌లో రెండు యంత్రాలు నడపడమేనన్నారు. రక్షణాధికారి దీనికి బాధ్యత వహించాలన్నారు. రక్షణ చర్యలు చేపట్టడంలో అధికారులు విఫలమవుతున్నారని ఆరోపించారు. యాజమాన్యం అవసరం నిమిత్తం అండర్‌గ్రౌండ్ కార్మికులను సర్ఫేస్‌లో పనిచేయిస్తూ అండర్‌గ్రౌండ్ అలవెన్సుల్లో కోత విధించడం తగదన్నారు. రికవరీ నిలిపివేయకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కొట్టి కిషన్‌రావు, ఏరియా కార్యదర్శి సంపత్, పిట్ కార్యదర్శి మారేపల్లి సార య్య, అసిస్టెంట్ పిట్ కార్యదర్శి సదానందం, నాయకులు శంకర్, యాదగిరి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

8న నేషనల్ అప్రెంటిస్‌షిప్ మేళా

శ్రీరాంపూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 8వ తేదీన శ్రీరాంపూర్‌లోని ప్రభుత్వ ఐటీఐలో ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిస్‌షిప్ మేళా(పీఎంఎన్ఏఎం) నిర్వహిస్తున్నట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ టి సుజాత ఒకప్రకటనలో తెలిపారు. మేళాలకు మల్టినేషనల్ కంపెనీలు హాజరవుతాయని, ఐటీఐ పాసైన విద్యార్థులు తమ సర్టిఫికెట్లు, జిరాక్స్ ప్రతులు, బయోడేటాతో ఉదయం 10 గంటల వరకు హాజరు కావాలని ఆమె కోరారు. అర్హత ఉన్న వారు www.apprenticeshipindia. gov.in వెబ్‌సైట్‌లో ముందుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఆమె కోరారు.

చేరికలపైనే దృష్టి...

(5వ పేజీ తరువాయి)

కాంగ్రెస్‌తోపాటు ప్రతిపక్ష పార్టీలైన బీజేపీ, బీఆర్‌ఎస్‌లు కూడా ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో తమ పార్టీ మద్దతునిస్తున్న అభ్యర్థులను గెలిపించుకునేందుకు ఆయా పార్టీల ముఖ్య నేతలు సైతం డబ్బులు వెదజల్లడానికి ఆలోచించడం లేదు. వీలైనన్ని పంచాయతీలను తమ ఖాతాల్లో వేసేకోవడానికి ప్రధాన పార్టీల నేతలు అలుపెరుగని కృషి చేస్తున్నారు.


బుగ్గదేవాలయంలో ఎమ్మెల్యే పూజలు

బెల్లంపల్లి,డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే గడ్డం వినోద్ పుట్టిన రోజు సందర్భంగా గురువారం కన్నాల గ్రామంలోని బుగ్గరాజరాజేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాయకులతో కలిసి శివలింగానికి అభిషేకం నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. నియోజక వర్గంలోని వివిధ మండలాల నాయకులు, అధికారులు ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

దివ్యాంగ విద్యార్థుల్లోని ప్రతిభను వెలికి తీయాలి

నెన్నెల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులైన విద్యార్థుల్లోని లోపాలను ఎత్తిచూపకుండా వారిలో దాగిఉన్న ప్రతిభను వెలికి తీసెందుకు కృషి చేయాలని ఎంఈవో చంద్ర శేఖర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని దుబ్బపల్లి-ఎస్ పాఠశాలలో గురువారం దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంఈవో ముఖ్య అతిథిగా పాల్గొని పిల్లతో కలసి కేక్ కట్ చేశారు. అనంతరం మాట్లాడుతూ మండలంలో 80 మంది దివ్యాంగ విద్యార్థులను గుర్తించామని, వారికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. భవిత సెంటర్‌లో ప్రత్యేక విద్యతో పాటు వారానికి రెండు రోజులు ఫిజియో థెరపీ అందిస్తామని, ఇందుకుగాను ట్రాన్స్‌పోర్ట్ ఎస్కార్ట్ చార్జీలు చెల్లిస్తామని చెప్పారు. రూ. 9 లక్షలు వెచ్చించి ప్రత్యేక భవనాన్ని నిర్మిస్తున్నామన్నారు. ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం మల్లికార్జున్, స్పెషల్ టీచర్ జంబి భీమేష్, ఐఈఆర్‌పీ మల్లన్న, రమేష్, సీఆర్‌పీ రాజేష్, అంగన్‌వాడీ కార్యకర్త సబిత పాల్గొన్నారు.

తమ్మి..తప్పుకోరాదె..



బుజ్జగింపులు....బేరసారాలు
రెబల్ అభ్యర్థులతో రాయబేరాలు
గ్రామ పెద్దల సమక్షంలో ఒప్పందాలు
బరిలో నిలిచేదెవరు... తప్పుకునేదెవరో...

బెల్లంపల్లి, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెండో విడత ఎన్నికలు జరిగే బెల్లంపల్లి నియోజక వర్గంలోని ఆయా గ్రామ పంచాయతీల్లో బుజ్జగింపులు, బేరసారాల పర్వానికి తెరలేపింది. నామినేషన్ల ఉపసంహరణకు శనివారం మాత్రమే గడువు ఉండడంతో ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు బేరాసాలు ప్రారం భించారు. తమ పార్టీ మద్దతుతో పోటీ చేసిన రెబల్స్‌తో సంప్రదింపులు, రాయబారాలు జరుపుతున్నారు. ఈ క్రమంలో బరిలో ఉన్న అభ్యర్థులు తమకు గెలుపునకు సరి పడే ఓట్లు ఉన్నాయని బేరాలు ప్రారంభించారు. నియోజక వర్గంలోని రెండో విడత ఎన్నికలు జరిగే అన్ని మండ లాల్లో ఇదే పరిస్థితి నెలకొంది.

తప్పుకోమని ఒత్తిడి..

బెల్లంపల్లి నియోజకవర్గంలో మొత్తం 7 మండలాల్లో రెండో విడత ఎన్నికలు జరుగనున్నాయి. ఏడు మండలాల పరిధిలో మొత్తం 114 గ్రామ పంచాయతీలు, 996 వార్డులు ఉన్నాయి.

ఇందులో ఒక్కో గ్రామం నుంచి ఐదు నుంచి పది మంది సర్పంచ్ అభ్యర్థు లుగా అలాగే 4 నుంచి 8 మంది వార్డు సభ్యులుగా పెద్ద ఎత్తున నామినేషన్ దాఖ లు చేశారు. ఈ క్రమంలో ఆశావహులు పెద్ద సంఖ్యలో పోటీకి సై అంటే సై అంటుం డడంతో ప్రధాన పార్టీ ముఖ్య నేతలకు బెంబెలె త్తిస్తోం ది. దీంతో ఆయా మండల నాయకులు స్వయంగా రం గంలోకి దిగి రెబల్స్‌ను బుజ్జగించే ప్రయత్నం ముమ్మ రం చేస్తున్నారు. ఉపసంహరణకు మరొక్క రోజే సమయం ఉండడంతో పోటీలో తమకు అడ్డుగా ఉన్న వారిని తప్పించే ఆఖరు ప్రయత్నాలు ముమ్మరంగా చేస్తున్నారు. రెబల్స్‌గా బరిలో దిగిన వారిని నామి నేషన్లను ఉపసంహరించుకోవాలని ఆయా పార్టీల నేతల ఒత్తిడి చేస్తున్నారు.

రేపటితో విత్‌డ్రాలు..

నామినేషన్ల ఉపసంహరణకు శనివారం చివరి రోజు. దీంతో రెబల్ అభ్యర్థులను విత్‌డ్రా చేయించే పనిలో నాయకులు ఉన్నారు. ఎంత చెప్పిన ససేమిరా అంటున్న నాయకులకు ఎంపీటీసీ, ఇతర నామినేటెడ్ పదవులు ఇప్పిస్తామని హామీలు ఇవ్వడం ప్రమాణాలు చేయించే పనిలో నాయకులు ఉన్నారు. ఈ పరిస్థితిలో ఎంత మంది తమ నామినేషన్ ఉపసంహరించుకుంటారో.. ఎంత మంది బరిలోఉంటారో శనివారం సాయంత్రం తేలనుంది.

బుజ్జగింపులు.. బేరసారాలు..

జిల్లాలోని బెల్లంపల్లి నియోజకవర్గంలో నామినేషన్ల స్వీకరణ పరిశీలన ముగిసింది. సర్పంచ్, వార్డు సభ్యులు ఎవరెవరో బరిలో ఉంటున్నారనేది తెలిసిపోయింది. దీంతో ఆయా గ్రామాల్లో రెబల్స్‌గా బరిలో దిగినవారి నామినేషన్లు ఉపసంహరించు కోవాలని ఆయా పార్టీల నేతలు ఒత్తిడి తెస్తున్నారు. తాయిలాలు ఇచ్చి పోటీ నుంచి తప్పించేందుకు చివరి ప్రయత్నాలు కొన సాగి స్తున్నారు. కొన్ని గ్రామాల్లో అయితే ప్రత్యర్థులను త ప్పించి ఏకగ్రీవం చేసేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. నామినేషన్ విత్‌డ్రా చేయించేందుకు పార్టీ పెద్దలు, కుల సంఘాల నాయకుల వద్దకు వెళ్లి బతి మిలాడుతున్నారు. కొన్ని చోట్ల ఊరి కోసం లక్షల రూపాయలు ఖర్చు చేస్తామని చె ప్పి పెద్ద మనుషుల వద్ద డిపాజిట్ పెడుతున్నారు ఏకగ్రీవమైతే ఊరి రూపు రే ఖలే మారుస్తామని హామీలు ఇస్తున్నారు.

కొనుగోళ్లలో ఇబ్బందులు కలిగించొద్దు

అదనపు కలెక్టర్ చంద్రయ్య



దండేపల్లి వరి కొనుగోలు కేంద్రంలో వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ చంద్రయ్య

దండేపల్లి డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించకుండా ధాన్యం కొనుగోలు చేయాలని జిల్లా ఆదనపు చంద్రయ్య సూచించారు. దండేపల్లి, మ్యాదరిపేటలోని ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోళ్లను గురువారం ఆయన పశీలించారు. కొనుగోలు కేంద్రాల వద్ద నిర్వాహకులు, ఐకేపీ సిబ్బందితో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యంను ఆరబెట్టిన తర్వాతనే నాణ్యమైన కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి ప్రభుత్వ మద్దతు ధర పొందాలన్నారు. కొనుగోలు చేసిన వెంటనే రైతుల వివరాలు ట్యాబ్ లలో నమోదు చేయాలని సిబ్బంది సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేయాలని, రైతులు కూడా నాణ్యమైన ధాన్యంను కొనుగోలు కేంద్రాలకు తీసుకవచ్చి విక్రయించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రోహిత్‌దేశ్‌పాండే, ఐకేపీ సిబ్బంది తిరుపతిగౌడ్, నిర్వాహకులు వాణి, అపర్ణ, రైతులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి పోలీసుల ఆకస్మిక తనిఖీ



పోలీసు అధికారులతో మాట్లాడుతున్న డీసీపీ

బెల్లంపల్లి, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో బుధవారం రాత్రి డీసీపీ భాస్కర్ కన్నాల గ్రామంలో గల నేరపవృత్తి కలిగిన రౌడీ షీటర్ల ఇళ్లను ఆకస్మికంగా పరిశీలించారు. వారి కదలికలను వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసు అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నామని తెలిపారు. రౌడీషీటర్లు సత్ప్రవర్తన దిశగా అడుగులు వేయాలని ఎలాంటి గొడవలకు పాల్పడ వద్దని సూచించారు. ఎవరైన తప్పు చేస్తే పీడియాక్టు కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ రవి కుమార్, సీఐ హనోక్, ఎస్ఐ రామకృష్ణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం

ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్

జన్నారం,డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పూర్తి స్థాయిలో విజయకేతనం ఎగురవేస్తుందని నిర్మల్ జిల్లా డీసీసీ అధ్యక్షులు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొ జ్జుపటేల్ అన్నారు. మండలంలోని చింతలపల్లి గ్రామంలో పర్యటించారు. ఈసందర్భంగా బీఆర్‌ఎస్ నాయకుడు, మాజీ సర్పంచ్ వొజ్జల లచ్చన్నతో పాటు గ్రామ నాయకులు శెట్టిపల్లి లచ్చన్న, రమేశ్, గడ్డం మల్లయ్య శేఖర్‌తో పాటు పలువురు ఎమ్మెల్యే సమక్షంలోపలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పేదకుటుంబానికి కాంగ్రెస్ సంక్షేమ పథకాలు అందుతున్నాయని, ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు పరుచడంలో సఫలీకృతుల మయ్యామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన ప్రతి నాయకుడు విజయకేతనం ఎగుర వేస్తాడని అన్నారు. మండల కాంగ్రెస్ నాయకు లు ముజాఫర్ అలీ, లక్ష్మీనారాయణ, మాణిక్యం, ఫసియుల్లతో పాటు మండల నాయకులు పాల్గొన్నారు.



పార్టీ కండువా కప్పుతున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్

ఘనంగా దత్తాత్రేయ జయంతి వేడుకలు

చెన్నూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరు పట్టణంలోని అంబా అగస్తేశ్వర ఆలయంలో గురువారం శ్రీ దత్తాత్రేయ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు గురు చరిత్ర పారాయణ సమాప్తం వేడుకలను నిర్వహించారు. గత ఏడు రోజులుగా గురు చరిత్రను పారాయణం చరిత్ర విన్న మహిళలు చివరి రోజు దత్తాత్రేయ స్వామి జయంతి రోజున సమాప్తం వేడుకల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు వేమారపు మహేశ్వర్ శర్మఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

దండేపల్లి: దత్తత్రేయస్వామి జయంతిని పురస్కరించుకుని గూడెంలోని షిర్డీ సాయి బాబా ఆలయంలో గురువారం దత్తత్రేయ జయంతి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు పురుషోత్తమచార్యుల ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులు స్వామి వారి పల్లకిసేవతో ఆలయం చుట్టు ప్రదక్షిణతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం దేవస్థానంలోఅన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు ఉన్నారు.

●మార్గశిర పౌర్ణమి జాతర పురస్కరించుకుని గూడెం సత్యనారాయణ స్వామి దేవాలయంలో గురువారం భక్తులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వ్రతాలను నోముకున్నారు. భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఈవో పేర్కొన్నారు.

మంచిర్యాల కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలో గురువారం దత్త జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాత మంచిర్యాలలోని షిర్డీసాయిబాబా ఆలయంలో మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు నృత్యాలు చేస్తూ కోలాటాలు ఆడారు. దివాకర్‌రావు మాట్లాడుతూ మంచిర్యాల నియోజకవర్గ ప్రజలందరపై దత్తాత్రేయ స్వామి ఆశీస్సులు ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు విజి త్‌రావు, మాజీ మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



చెన్నూర్ శివాలయంలో పూజలు చేస్తున్న మహిళలు

కాసిపేటలో ఆకట్టుకున్న విద్యార్థుల మాక్ పోలింగ్

దండేపల్లి డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో భాగంగా దండేపల్లి మండలం కాసి పేట ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలో గురువారం విద్యార్థులు నిర్వహించిన మాక్ పోలింగ్ ఆకట్టుకుంది. రాజ్యాంగంలో పొందుపరిచిన విధంగా ప్రజాస్వామ్య దేశంలో జరిగే ఎన్నికల విధానం గురించి విద్యార్థులకు ఉపాధ్యాయ బృందం విద్యార్థులకు అవగాహన కల్పించారు.

ఎన్నికల ప్రక్రియ గురించి, విద్యార్థులకు తెలియ జేయడానికి కోసమే పాఠశాలో విద్యార్థులచే మాదిరి పోలింగ్, ఓటర్ల లిస్ట్ తయారి విధానం, పోలింగ్ సిబ్బంది నియమించడం, ఎన్నికల బరిలో అభ్యర్థుల నామినేషన్ వేసే విధానం, ఓటర్ల ఓటు వేసే విధానం, ఓటు కౌంటింగ్, గెలి పొందిన అభ్యర్థులచే ప్రమాణ స్వీకారం చేయించే విధానం తదితర అంశాలపై మాక్ పోలింగ్ నిర్వహించారు.



కాసిపేట ప్రభుత్వ పాఠశాలో మాక్ పోలింగ్ ఓట్లు లెక్కిస్తున్న విద్యార్థులు

ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలి



వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ కుమార్ దీపక్, అధికారులు

మంచిర్యాల కలెక్టరేట్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ ఎన్నికల్లో ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని పేర్కొన్నారు. గురువారం హైద్రాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్, ఎన్నికల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల కమిషనర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తన నియమావళిని సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. నామినేషన్‌ల ప్రక్రియలో జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ,ఫారం 14,20 వినియోగంపై అప్రమత్తంగా ఉండాలన్నారు. నామినేషన్‌ల ప్రక్రియలో నెలకొన్న సమస్యలు, అందిన ఫిర్యాదుల పరిష్కారంపై సత్వరమే చర్యలు తీసుకోవాలని సూచించా రు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లాలో 306 గ్రామపంచాయతీలు, 2,680 వార్డు సభ్యుల స్థానాలకు మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించేందుకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేశామన్నారు. జిల్లాలో 6 మంది సర్పంచులు, 268 మంది వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యా రని తెలిపారు. సర్పంచు స్థానాల ఎన్నిక మొదటి విడతలో 6 స్థానాలు ఏక గ్రీవం కాగా, 3 స్థానాల్లో నామినేషన్‌లు రాలేదని , 81 స్థానాల్లో పోలింగ్ నిర్వ హిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎన్నికల అధికారి వెంకటే శ్వర్‌రావు, జెడ్పీ సీఈవో గణపతి, అధికారులు పాల్గొన్నారు.

ఇంటర్నేషనల్ సైన్స్‌ఫెస్టివల్‌కు ఉపాధ్యాయుడు ఎంపిక



ప్రవీణ్(ఫైల్)

కాసిపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో పని చేస్తున్న సైన్స్ ఉపాధ్యాయుడు జాడి ప్రవీణ్ ఇంటర్నేషనల్ సైన్స్‌ఫెస్టివల్‌కు ఎంపికైనట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపల్ అందె నాగమల్లయ్య తెలిపారు. ఈ నెల 6 నుంచి 9 వరకు హర్యాణాలోని పంచకులలో ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్ జరగనుం దన్నారు. విజ్ఞానసే సమృద్ధి ఫర్ ఆత్మ నిర్భర్ భారత్ అనే అంశంపై మాట్లాడనున్నట్లు తెలిపారు. కేంద్ర భూవి జ్ఞాన మంత్రిత్వ శాఖ నిర్వహించే ఈ కార్యక్రమంలో దేశంలోని ప్రముఖ శాస్త్రవేత్తలు, పరిశోధకులు హాజరవుతారన్నారు. జాడి ప్రవీణ్ విద్యార్థులకు సైన్స్‌పై ఆసక్తిని పెంచడం తదితర విషయాలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం ప్రవీణ్‌ను ఎంపిక చేసిందన్నారు. ఉపాధ్యాయుడు ప్రవీణ్‌ను తోటి ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

స్థానిక పోరులో నోటాకు చోటు

బ్యాలెట్ పేపరుపై గుర్తింపు
ఓటర్లకు అవగాహన కల్పిస్తే మేలు


దండేపల్లి డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో నోటా గుర్తును తొలిసారిగా ప్రవేశ పెడుతూ ఎన్నికల కమిషన్ నిర్ణయించింది. పైన ఉన్న అభ్యర్థులు ఎవరూ నచ్చకపోతే.. నోటాకు ఓటు వేసే అవకాశం కల్పించింది. దీంతో ఆ గుర్తుపై ప్రజల్లో చర్చ, అభ్యర్థుల్లో ఆందోళన మొదలైంది. శాసనసభ, పార్లమెంటు ఎన్నికలకే పరిమితమైన నోటాను తొలిసారిగా పంచాయతీ ఎన్నికల్లో ఎన్నికల కమిషన్ ప్రవేశ పెట్టింది. స్థానిక ఎన్నికల్లో సర్పంచ్, వార్డు సభ్యుడిగా పోటీ చేసే అభ్యర్థి నచ్చకపోతే నోటాకు ఓటు వేసే అవకాశం ఓటర్లకు కల్పించింది. అయితే తొలిసారిగా అమలు చేస్తున్న దీనిపై గ్రామీణ ప్రాంత ప్రజలకు మరింత అవగా హన కల్పించాల్సిన అవసరం ఉంది. సాధారణ ఎన్నికలతో పోలిస్తే ..స్థానిక పోరు గ్రామాల అభివృద్ధికి కీలకం. బరిలో నిలిచిన ప్రతి అభ్యర్థికి ప్రతీ ఓటు ముఖ్యమే. ఒకటి, రెండు ఓట్ల తేడాతో అభ్యర్థులు ఓటమిని చవి చూ సిన సందర్భాలు అనేకం. అయితే ఈ సారీ బ్యాలెట్ పేపర్‌లో ఎన్నికల కమిషన్ నోటాకు అవకాశం ఇవ్వడంతో అభ్యర్థుల్లో ఇప్పటి నుంచే వణుకు మొదలైంది.

గ్రామీణ ప్రజలకు అవగాహన అవసరం.

స్థానిక ఎన్నికలకు అధికారులు సర్వం సిద్దం చేశారు. బ్యాలెట్ పత్రాలు, పోలింగ్ సామగ్రి సిద్దంగా ఉంచారు. మండల కేంద్రాలకు తరలించారు. బ్యాలెట్ పత్రంపై నోటా గుర్తును సైతం ముద్రించడంతో.. దీనిపై పల్లెల్లో అవగాహన కార్యక్రమాలు చేపటాల్సి ఉంది. ఇటీవల సాధారణ ఎన్నికల్లో ఈవీఎం లలో నోటా గుర్తుపై ప్రజలకు వివరించారు. గ్రామాల్లో ఎక్కువగా నిరక్షరాస్యులు ఉండే అ వకాశం ఉండటంతో వారికి దీనిపై అవగాహ న ఉండదు. కావున నోటా గుర్తుపై అవగా హన అనివార్యం.

నోటాతో తారుమారు.

నోటా గుర్తు వలన ఓటర్లు ఇబ్బందిపడే అ వకాశాలున్నాయి. అది ఒక అభ్యర్థి గుర్తుగానే భావించి, అవగాహన లేమితో కొందరు దానికి ఓటేసే అవకాశం లేకపోలేదు. ఒకవేళ అదే జరిగితే.. అది నోటా లెక్కలోకి వెళ్తుంది. ప్రస్తుతం ఎన్నికల్లో గ్రామాలను బట్టి 300 నుంచి 10వేల వరకు ఓటర్లు ఉన్న పంచాయతీలు ఉంటాయి. వేయ్యి మంది ఓటర్లు గల జీపీలు 60 శాతానికి పైగా ఉంటాయి. వార్డుల్లో 50 నుంచి 200లకు పైగా ఓటర్లు ఉంటారు. సర్పంచ్, వార్డు సభ్యుల ఫలితాలు ఒకటి, రెండెంకెల ఓ ట్ల తేడాతో ఎన్నికయ్యే సందర్భాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో నోటా గురించి.. ఓటర్లకు అవగాహన కల్పించకపోతే.. ఫలితాలు తారుమారు అయ్యే ప్రమాదం ఉంటుందని పోటీదారులు భయాం దోళన చెందుతున్నారు.



నోటా నమూనా బ్యాలెట్ పత్రం

నిందితులను కఠినంగా శిక్షించాలి

దండేపల్లి డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలంలోని ఎల్లమరు గ్రామంలో సర్పంచ్ అభ్యర్థి భర్తను కిడ్నాప్ చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం అధ్యక్షుడు కుమారస్వామి యాదవ్ డిమాండ్ చేశారు. గురువారం దండేపల్లిలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్పంచ్ అభ్యర్థి నాగలక్ష్మి భర్తను మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అనుచరులు కిడ్నాప్ చేసి నామినేషన్ ఉపసంహరించుకోవాలని బెదిరింపులకు పాల్పడ్డారన్నారు. నిందితులను వెంటనే అరెస్ట్ చేసి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులకు వసతులు కల్పించాలి

లక్షెట్టిపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వసతిగృహాల్లో విద్యార్థులకు వసతులు పూర్తిస్థాయిలో కల్పిం టచాలని భారతీయ ఐక్య విద్యార్థి ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని డిగ్రీ కళాశాల ఆవరణలో ఉన్న బాలుర వసతిగృహాన్ని యుఎస్‌ఎఫ్‌ఐ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చలి తీవ్రత ఎక్కువగా ఉందని విద్యార్థులకు ప్రభుత్వం దుప్పట్లు, బ్లాంకెట్స్ అందించాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా విద్యార్థులు ప్రతీ రోజు చన్నీటి స్నానం చేయాల్సి వస్తోందని వసతిగృహంలో గీజర్లను కానీ హీటర్లు గానీ ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహారం అందించాలని కోరారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో యుఎస్‌ఎఫ్‌ఐ నాయకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న టీఎన్‌జీవో సభ్యత్వ నమోదు

మంచిర్యాల క్రైం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా కేంద్రంలో టీఎన్‌జీవోస్ సభ్యత్వ నమోదు కొనసాగుతుంది. జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి, యూనిట్ అధ్యక్షుడు నాగుల గోపాల్ ఆధ్వర్యంలో మంచిర్యాల ఐటీఐ కళాశాలలో 102 మంది నాన్ గెజిటెడ్ ఉద్యోగులు టీఎన్‌జీవో సభ్యత్వం తీసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని శాఖల సహకారంతో డిసెంబరు 10లోపు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. నాయకులు రమేష్, శ్రీధర్, పద్మలత, అజయ్ ప్రశాంత్, ప్రకాష్, ఉద్యోగులు పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదు చేస్తున్న టీఎన్‌జీవో నాయకులు

ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా సహకరించాలి

- బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్

కన్నెపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రజలందరు సహకరించాలని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ సూచించారు. గురువారం మండలంలోని నాయకునిపేట పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలతో ఆయన మాట్లాడుతూ ప్రజలు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఎవరైనా ఓటర్లను భయపెడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. యువకులు ఎన్నికల గొడవల్లోకి వెళ్లవద్దని సూచించారు. ఓటర్లు ఓటు హక్కును నిర్భయంగా వినియోగించునేలా పోలీసు బందోబస్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీఐ దేవయ్య, ఎస్ఐ భాస్కర్‌రావు, పోలీసులు పాల్గొన్నారు.

సర్పంచ్ బరిలో ట్రాన్స్ జెండర్


ట్రాన్స్‌జెండర్ వైశాలి

జైపూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెంకట్రావుపల్లె సర్పంచు అభ్యర్థిగా ట్రాన్స్‌జెండర్ కుమ్మరి వైశాలి బరిలోకి దిగారు. వెంకట్రావుపల్లి జనరల్ మహిళకు రిజర్వు కావడంతో ఆమె బరిలోకి దిగుతున్నారు. గురువారం వైశాలి తన నామినేషన్‌ను ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు అందజేశారు. ఆమె మాట్లాడుతూ వెంకట్రావుపల్లి గ్రామ ప్రజలు తనను సర్పంచుగా గెలిపిస్తే ప్రభుత్వ నిధులతో గ్రామాన్ని మండలంలోనే ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని తెలిపారు.

సాయిబాబా ఆలయంలో పూజలు

శ్రీరాంపూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : దత్తాత్రేయ జయంతిని పురస్కరించుకొని ఆర్‌కే 8 కాలనీలోని సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు పాల్గొని పూజలు చేశారు. ఆయన వెంట సింగాపూర్ మాజీ సర్పంచ్ గుంట జగ్గయ్య, ఎంపీటీసీ మాజీ సభ్యులు గుమ్మడి శ్రీనివాస్, తిరుపతి, కో-ఆప్షన్ సభ్యులు భాగ్య-శ్రీనివాస్, రఫీక్ ఖాన్, నరేష్, రాజేశ్వర్‌రెడ్డి, పాల్గొన్నారు.

బరిలో భార్యాభర్తలు..

సర్పంచ్‌గా భార్య..వార్డు సభ్యుడిగా భర్త..


దండేపల్లి డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం రెబ్బనపల్లి గ్రామంలో పంచాయతీ ఎన్నికల బరిలో దంపతులు ఇద్దరు బరిలో ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ బలపరిచినకందుల సర్పంచ్ స్థానంలో కందుల కళ్యాణి పోటీలో ఉండగా, ఆమె భర్త కందుల అశోక్ గ్రామంలో 7వ వార్డు సభ్యుడి పోటీలో ఉన్నారు. 2019 నుంచి 2024 వరకు రెబ్బనపల్లి గ్రామ సర్పంచ్‌గా కందుల కళ్యాణి పని చేశారు.రెండో సారీగా సర్పంచ్ పోటీలో ఉన్నారు.

ఒకే కుటుంబం నుంచి నాలుగురు బరిలో..

దండేపల్లి డిసెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల బరిలో ఒకే కుటుంబానికి చెందిన నాలుగురు పోటీ చేస్తున్నారు. దండేపల్లి సర్పంచ్ అభ్యర్థిగా అజ్మీర ప్రదీప్‌నాయక్, అతడి భార్య అజ్మీర లలిత 4వ వార్డు అభ్యర్థిగా, అతడి కొడుకు అజ్మీర దేవేందర్‌నాయక్ 2వ వార్డు అభ్యర్థిగా, కోడలు అజ్మీర శారద మూడో వార్డు అభ్యర్థిగా పోటీలో ఉన్నారు. ఒకే కుటుంబానికి చెందిన వీరిని బీఆర్‌ఎస్ పార్టీ బలపరుస్తోంది.

చేరికలపైనే దృష్టి..

- ఎన్నికల వేళ ఓటర్లకు గాలం
- పార్టీలో చేర్చుకొనేందుకు ఆరాటం
- వారిపైనే ఆధారపడుతున్న అభ్యర్థులు
- పెరుగుతున్న ఎన్నికల వ్యయం



మంచిర్యాల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలు దగ్గరపడుతున్న కొద్దీ వివిధ పార్టీల నేతలు చేరికలపై ప్రధానంగా దృష్టిసారిస్తున్నారు. చేరికలను ఓట్లుగా మార్చుకొనే పన్నాగంతో వివిధ పార్టీల నుంచి విరివిగా వలసలను ప్రోత్సహిస్తున్నారు. దీంతో ఒక పార్టీ నుంచి మరో పార్టీలో చేరే వారి సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది. ప్రధాన పార్టీలైన బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీలు ఈ ఒరవడిని అవలంబిస్తున్నాయి. వివిధ గ్రామాలు, వార్డుల్లోని ద్వితీయ శ్రేణి నాయకులను చేరదీయడం ద్వారా పంచాయతీ ఎన్నికల్లో తమ బలం పెంచుకొనేందుకు ముఖ్య నాయకులు ఆరాటపడుతున్నారు.

అందినకాడికి దండుకోవడమే లక్ష్యం..?

జిల్లాలోని మంచిర్యాల, చెన్నూరు, బెల్లంపల్లి నియోజక వర్గాల్లోని చోటా మోటా నాయకులు కొందరు పంచాయతీ ఎన్నికల్లో అందినకాడికి దండుకోవడమే లక్ష్యంగా పావులు కదుపుతున్నట్లు చర్చ జరుగుతోంది. ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ సర్పంచ్ అభ్యర్థులను తమ దారికి తెచ్చుకొనే ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రధాన పార్టీల్లో నెలకొన్న పోటీని కొందరు ద్వితీయశ్రేణి నాయకులు అవకాశంగా మల్చుకుంటున్నారు. పార్టీలతో సంబంధం లేకుండా డిమాండ్ల పేరిట అందినకాడికి దండుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ బ్లాక్ మెయిల్ రాజకీయాల కారణంగా ప్రధాన పార్టీలు మద్దతునిస్తున్న పలువురు అభ్యర్థులు అయోమయానికి గురవుతు న్నారు. తమ పరిధిలో ఇంతమంది ఓటర్లు ఉంటారని, వారిని మచ్చిక చేసుకునేందుకు ఇంత మొత్తం కావాలం టూ అభ్యర్థులపై ఒత్తిడి తెస్తున్నారు. అలాగైతేనే పార్టీ మారతామంటూ అల్టిమేటం జారీ చేస్తున్నారు. ఇలా ఒక పార్టీ కాకుండా పోటీలో ఉన్న అన్ని ప్రధాన పార్టీల మద్దతున్న అభ్యర్థులకు ఇదే పరిస్థితులు ఎదురవుతు న్నట్లు గ్రామాల్లో ప్రచారం జరుగుతోంది. ప్యాకేజీలు మాట్లాడుకుంటూ ఓట్లు వేయిస్తామనే హామీ ఇస్తుండటంతో విపరీతమైన పోటీ ఎదుర్కొంటున్న అభ్యర్థులు తప్పనిసరి పరిస్థితుల్లో వారి వలలో చిక్కుకుంటున్నారు.

ప్రలోభాలతో మచ్చిక చేసుకునే యత్నం...

పంచాయతీ ఎన్నికల్లో గ్రామాలను కైవసం చేసుకొనేందుకు వివిధ పార్టీల నాయకులు అన్ని దారులూ వెతుక్కుంటున్నారు. వీలైతే ఏకగ్రీవం...లేదంటే గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. వార్డుల వారీగా కొందరు చోటా మోటా నాయకులను ఎంపిక చేసుకుంటున్న అభ్యర్థులు ఓటర్లను దారి తెచ్చే పని వారికి అప్పగిస్తున్నారు. దీంతో వార్డుల వారీగా నాయకులు డిమాండ్ చేసినంత ఇవ్వక తప్పని పరిస్థితులు నెలకొన్నాయి. ప్రస్తుతానికి ఇంటింటికీ మద్యం పంపిణీ చేసే బాధ్యతలను అభ్యర్థులు అప్పగిస్తున్నారు.

పెరుగుతున్న ఖర్చులు....

పంచాయతీ ఎన్నికల్లోనూ పెద్ద మొత్తంలో డబ్బుల పంపిణీకి తెరలేచినట్లు తెలుస్తోంది. సర్పంచ్ అభ్యర్థులు కొన్ని చోట్ల రూ. 30 లక్షల నుంచి రూ. 50 లక్షల వరకు వెచ్చించేందుకూ సిద్ధపడుతున్నట్లు సమాచారం. ద్వితీయ స్థాయి నాయకులకు నిత్యం దావత్‌లు ఏర్పాటు చేయడంతోపాటు ఓటర్లకు బహుమతుల రూపంలో అధికంగా ఖర్చు చేస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌లు మద్దతిస్తున్న అభ్యర్థులు ఈ దిశగా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు పంచాయతీ ఎన్నికలను అధికార పార్టీ మిగతా 7లో..

నామినేషన్ ప్రక్రియ సమర్థవంతంగా చేపట్టాలి

కలెక్టర్ కుమార్ దీపక్


బూరుగుపల్లిలో అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

భీమారం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీల ఎన్నికల్లో నామినేషన్‌ల ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. గురువారం భీమారం, బూరుగుపల్లి, ఖాజీపల్లిలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నామినేషన్ ప్రక్రియలో అభ్యర్థులు సమర్పించిన పత్రాలను ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. నిర్ణీత గడువు దాటిన తర్వాత వచ్చే నామినేషన్‌లను తీసుకోకూడదని, రిజిష్టర్‌లను సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బందిని నియమించుకోవాలని, హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలన్నారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించాలన్నారు. అనంతరం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలన్నారు. మధ్యాహ్న భోజనం నాణ్యను పరిశీలించి తగు సూచనలు చేశారు. విద్యార్థినుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కలెక్టర్ వెంట ఎంపీడీవో మధుసూదన్, సీఐ నవీన్ ఉన్నారు.

గిరి ప్రదక్షణ


గిరి ప్రదక్షణలో పాల్గొన్న భక్తులు

మందమర్రిరూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : బొక్కలగుట్ట గ్రామంలోని రుష్య ముఖి పర్వతంపై గురువారం భక్తులు గిరి ప్రదక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గుట్ట చుట్టూ భక్తి పాటలు పాడుతూ గిరి ప్రదక్షణలో పాల్గొన్నారు. ప్రతి నెల గిరి ప్ర దక్షణ నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ సభ్యుడు బలికొండ కిషన్ తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి పాటించాలి

రాష్ట్ర ఎన్నికల సాధారణ పరిశీలకులు మనోహర్


సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

లక్షెట్టిపేట, డిసెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): రెండవ సాధారణ ఎన్నికల్లో బాగంగా ప్రతీ ఒక్క అభ్యర్థితో పాటు ఎన్నికల సిబ్బంది సైతం నియమావళి తప్పకుండా పాటించాలని రాష్ట్ర ఎన్నికల సాధారణ పరిశీలకులు మనోహర్ అన్నారు. గురువారం పట్టణంలోని కేఎస్ఆర్ గార్డెన్స్‌లో మొదటి విడతలో ఎన్నికలు జరుగనున్న లక్షెట్టిపేట, జన్నారం, దండేపల్లి, హాజీపూర్ మండలాల సర్పంచ్ అభ్యర్థులతో పాటు ఎన్నికల సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అభ్యర్థులంతా సామరస్యపూర్వకంగా ఎన్నికలు జరిగేందుకు సహకరించాలన్నారు. జిల్లా అదనపు ఎన్నికల అధికారి చంద్రయ్య మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో గ్రామస్థాయి ఎన్నికలు చాలా కీలకమన్నారు. ప్రతీ పైసా ఖర్చుకు లెక్క ఉంటుందని నూతనంగా ఒక బ్యాంక్ ఎకౌంట్ ఓపెన్ చేసి దాని ద్వారా లావాదేవీలు జరిపి ఎన్నికల అనంతరం అట్టి ఎకౌంట్ నుంచి చేసిన ఖర్చు వివరాలు ఎన్నికల సిబ్బందికి అప్పగించాల్సి ఉంటుందన్నారు. ఈకార్యక్రమంలో ఎన్నికల వ్యయ పరిశీలకులు రాజేశ్వర్, నాలుగు మండలాల తహసీల్దార్‌లు శ్రీనివాస్ దేశ్‌పాండే, దిలీప్‌కుమార్, రోహిత్ దేశ్‌పాండే, రాజమనోహర్‌రెడ్డి, ఎంపీడీవో సరోజ, మంచిర్యాల మహిళ పోలీస్ స్టేషన్ సీఐ నరేష్ కుమార్, ఎస్సైలు గోపతి సురేష్, స్వరూప్‌రాజ్, తహసీయోద్దీన్, అనూష పాల్గొన్నారు.

మాజీ సీఎం రోశయ్య సేవలు చిరస్మరణీయం



నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్ ..సీపీ అంబర్ కిషోర్ ఝూ

మంచిర్యాల కలెక్టరేట్, డిసెంబరు 4 (ఆంధ్ర జ్యోతి) : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా పనిచేసిన దివంగత కొణిజేటి రోశయ్య సేవలు చిరస్మరణీయమని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. గురువారం కలెక్టర్ సమావేశ మందిరంలో రోశయ్య వర్ధంతిని ఘనంగా నిర్వహిం చారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో ఆర్థిక మంత్రిగా ఎన్నోసార్లు బడ్జెట్ ప్రవేశపెట్టారని, ముఖ్యమంత్రిగా వినూత్న సంస్కరణలతో అభివృద్ధి చేశారన్నారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల గవర్నర్‌గా పని చేసి విశిష్ట సేవలందించారన్నారు. డీఆర్‌డీవో కిషన్, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు చాతరాజుల దుర్గా ప్రసాద్, జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తం నాయక్, జిల్లా యువజన క్రీడ సేవల అధికారి హనుమంత్‌రెడ్డి, కలెక్టరేట్ పరిపాలన అధికారి రాజేశ్వర్ పాల్గొన్నారు.

మంచిర్యాల క్రైం : మాజీ ముఖ్యమంత్రి రోశయ్య రాజనీతి భావి తరాలకు స్ఫూర్తినిస్తుందని రామగుండం పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ అన్నారు. కమిషనరేట్ కార్యాలయంలో రోషయ్య వర్ధంతి వేడుకల సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోశయ్య రాజకీయ ప్రస్థానం, సాదాసీదా జీవనవిధానం అని, పరిపాలన నైపుణ్యం వంటి అంశాలను ఈ సందర్భంగా స్మరించారు. ప్రజలకు అందించిన సేవలు నేటి తరానికి ఆదర్శప్రాయమన్నారు. ప్రజాసేవలో ఆయన నిరంతరం నిమగ్నమై సేవలందించారని, ఆయన ఆశయాలను సాధించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ అడిషనల్ డీసీపీ అడ్మిన్ శ్రీనివాస్, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఏవో శ్రీనివాస్, ఇన్స్పెక్టర్లు, సీపీవో సిబ్బంది, సిబ్బంది పాల్గొన్నారు.

● నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి రోశయ్య వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలో అసిస్టెంట్ కమిషనర్ రాజమనోహర్ రోశయ్య చిత్రపటానకి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ కరుణాకర్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

21 రకాల పూలతో స్వామికి అభిషేకం

నస్పూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : హౌసింగ్ బోర్డు కాలనీలోని శ్రీ లక్ష్మి గణపతి దేవాలయంలో సంకట హర చతుర్థి సందర్భంగా ఈ నెల 8న స్వామి వారికి 1008 కిలోల 21 రకాల పూలతో పుష్పాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ రఘుపతిరావు, ఆలయ ప్రధానార్చకులు వంశీ కృష్ణ శర్మలు ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. తెల్ల చామంతి, పసుపు చామంతి, ఎర్ర గులాబీ, పసుపు గులాబీ, మల్లె, జాజి, కనకాంబరం, నందివర్ధనం, గరుడ వర్ధనం, లిల్లీ, నూరు వరహాలు, కలువలు, తామరలు, నాగమల్లి, ఆర్కిడ్, తుమ్మి, గన్నేరు, జర్బెరా, బిల్వం, దవనం తదితర రకాల పూలతో అభిషేకం ఉంటుందన్నారు. ఆలయాన్ని రంగు రంగుల పూలతో ఆలంకరణ చేస్తామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించి తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని కోరారు. అలాగే 11న ఆలయం అవరణలో అయ్యప్ప పడి పూజ ఉంటుందన్నారు.

పంచాయతీ ఎన్నికల్లో మహిళా ఓటర్లే ఎక్కువ

చెన్నూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పురుషుల కంటే మహిళా ఓటర్లే ఎక్కువగా ఉన్నారు. మండలంలోని 30 గ్రామపంచాయతీల్లో మొత్తంగా 26,475 మంది ఓటర్లు ఉండగా ఇందులో పురుషులు 13,040 ఉండగా మహిళలు 13435 మంది ఉన్నారు. పురుషుల కంటే మహిళలే 395 మంది ఎక్కువగా ఉన్నారు. అక్కెపల్లి గ్రామపంచాయతీలో 391 మంది పురుషులు, 364 మంది మహిళలు ఉన్నారు. అంగ్రాజ్‌పల్లిలో 477 పురుషులు, మహిళలు 510, ఆస్నాదలో పురుషులు 841, మహిళలు 840 ఉన్నారు. బీరవెల్లిలో పురుషులు 218, మహిళలు 230, బావు రావుపేటలో పురుషులు 377, మహిళలు 426, బుద్దారంలో పురుషులు 134, మహిళలు 137, చాకెపల్లిలో పురుషులు 187, మహిళలు 177, చెల్లాయిపేట లో 214 పురుషులు, 213 మహిళలు, చింతలపల్లిలో 249 పురుషులు, 246 మహిళలు, దుగ్నేపల్లిలో 752 పురుషులు, 804 మహిళలు, ఎర్రగుంటపల్లిలో పురుషులు 485, మహిళలు 497, గంగారంలో పురుషులు578, మహిళలు 584, కాచనపల్లిలో 299 పురుషులు, 309 మహిళలు, కత్తెరసాలలో 452 మంది పురుషులు, 491 మంది మహిళలు, కిష్టంపేటలో 1467 పురుషులు, 1562 మహిళలు, కొమ్మెరలో 565 పురుషులు, 576 మహిళలు, లంబాడిపల్లిలో 223 పురుషులు, 220 మహిళలు, లింగంపల్లిలో 228 పురుషులు 226 మంది మహిళలు, ముత్తరావుపల్లిలో 231 మంది పురుష లు, 234 మంది మహిళలు, నాగా పూర్‌లో 455 పురుషులు, 478 మంది మహిళలు, నారాయణపూర్‌లో 402 పు రుషులు, 406 మహిళలు, ఓత్కులపల్లిలో 299 పురుషులు, 323 మహిళలు, పొక్కూరులో 466 పురుషులు, మహిళలు 473, పొన్నారంలో పురుషులు 220, మహిళలు 224, రచ్చపల్లిలో పురుషులు 201, మహిళలు 172, సంకారంలో పురుషులు 263, మహిళలు 265, సోమనపల్లిలో పురుషులు743, మహిళలు 796, సుద్దాలలో పురుషులు832, మహిళలు 857, సుందరసాలలో 520 పురుషులు, 505 మహిళలు, వెంకంపేటలో 271 పురుషులు, 287 మహిళ ఓటర్లు ఉన్నారు. 30 గ్రామపంచాయతీల్లో 244 వార్డులు ఉన్నాయి.

రెండో రోజు 632 నామినేషన్లు

● సర్పంచ్ స్థానాలకు 162 ● వార్డు సభ్యులకు 470 దాఖలు


కోటపల్లిలో నామినేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో

మంచిర్యాల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో భాగంగా మూడో విడత రెండో రోజు మొత్తం 632 నామినేషన్లు దాఖలయ్యాయి. చెన్నూర్ నియోజకవర్గంలోని మందమర్రి, చెన్నూర్, జైపూర్, కోటపల్లి, భీమారం మండలాలకు సంబంధించి మొత్తం 102 సర్పంచ్ స్థానాలు, 868 వార్డు మెంబర్ల స్థానాలు ఉన్నాయి. ఆయా మండలాల్లో గురువారం సర్పంచ్ స్థానాలకు 162, వార్డు మెంబర్ల స్థానాలకు 470 నామినేషన్లు దాఖలయ్యాయి.

చెన్నూర్ : పంచాయతీ ఎన్నికల్లో భాగంగా మండలంలోని పది నామినేషన్ కేంద్రాల్లో గురువారం అధికారులు నామినేషన్‌లు స్వీకరించారు. సర్పంచ్ స్థానానికి 19 పంచాయతీల్లో సర్పంచు స్థానానికి 46, అలాగే 244 వార్డులకు గాను 157 నామినేషన్లు దాఖలైనట్లు ఎంపీడీవో మోహన్ తెలిపారు.

మందమర్రిరూరల్ : అందుగులపేటలో సర్పంచుకు 2, పులిమడుగులో సర్పంచుకు 1, బొక్కలగుట్టలో సర్పంచుకు 1, సారంగపల్లిలో సర్పంచుకు 1, చిర్రకుంటలో 5, శంకర్‌పల్లిలో 1, ఆదిల్‌పేటలో 4, పొన్నారంలో 1, మామిడిగట్టులో 1, వెంకటాపూర్‌లో సర్పంచుకు 2 నామినేషన్‌లు మొత్తం 19 నామినేషన్‌లు దాఖలయ్యాయి. వార్డు సభ్యులకు అందుగులపేటలో 7, పులిమడుగులో 2, సారంగపల్లిలో 2, చిర్రకుంటలో 6, ఆదిల్‌పేటలో 8, పొన్నారంలో 1, వెంకటాపూర్‌లో 12 నామినేషన్‌లు దాఖలైనట్లు ఎంపీడీవో రాజేశ్వర్ తెలిపారు. నామినేషన్ కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

కోటపల్లి : మండలంలోని 31 పంచాయతీలకు గాను 22 పంచాయతీల్లో సర్పంచు స్థానాలకు 35 మంది అభ్యర్థులు నామినేషన్‌లు సమర్పించారు. 118 మంది వార్డుల సభ్యుల స్థానాలకు నామినేషన్‌లు దాఖలు చేశారు. రెండు రోజులవి కలుపుకుని 54 మంది సర్పంచు అభ్యర్థులు, 147 మంది వార్డు సభ్యుల నామినేషన్‌లు సమర్పించారు.

జైపూర్ : పంచాయతీ ఎన్నికల్లో భాగంగా మూడవ విడతలో ఏర్పాటు చేసిన నామినేషన్ ప్రక్రియలో 5 నామినేషన్ కేంద్రాల్లో గురువారం 40 మంది సర్పంచు అభ్యర్థులు నామినేషన్‌లు దాఖలు చేశారు. 124 మంది వార్డు సభ్యులు నామినేషన్‌లు వేసినట్లు ఎంపీడీవో సత్యనారాయణ పేర్కొన్నారు.


భీమారం : మండలంలోని 11 గ్రామపంచాయతీలు ఉండగా గురువారం నామినేషన్‌ల స్వీకరణ కొనసాగింది. సర్పంచుకు 22 నామినేషన్‌లు, వార్డు సభ్యునికి 33 దాఖలైనట్లు ఎంపీడీవో మధుసూదన్ తెలిపారు.

తమ్మీ..తప్పుకోరాదె
బుజ్జగింపులు....బేరసారాలు
రెబల్ అభ్యర్థులతో రాయబేరాలు
7

ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే తీవ్ర పరిణామాలు

మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాల కలెక్టరేట్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల నియమావళిని విస్మరించి అధికారులు తీవ్ర పరిణామాలను ఎదుర్కోక తప్పదని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దండేపల్లి మండలం పాత మామిడిపల్లి గ్రామంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి మాధవిని కాంగ్రెస్ నాయకుల అండదండలతో ఒత్తిడి చేసి నామినేషన్ విత్‌డ్రా చేసుకునేలా చేయడం అమానుషమన్నారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన నియమ నిబంధనలను తుంగలో తొక్కి ఎన్నికల కోడ్‌ను సైతం విస్మరించిన స్థానిక ఎస్‌ఐని, రిటర్నింగ్ అధికారులను వెంటనే విధుల నుంచి తొలగించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. న్యాయస్థానాలపై తమకు పూర్తి విశ్వాసం ఉందని, ఈ అంశంపై హైకోర్టుకు వెళ్లి న్యాయం జరిగేలా చూస్తామన్నారు. తమ ప్రభుత్వ హయాంలో పూర్తి పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించినప్పటికీ ఏ ఒక్క చోట అపశృతులు దొర్లిన దాఖలాలు లేవన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి మాధవి ఉపసంహరణ చేసుకునే సమయం దాటిపోయినప్పటికీ కూడా ఆమెను విత్‌డ్రా చేయించడానికి స్థానిక పోలీసులు భయభ్రాంతులకు గురి చేసి కేసులు నమోదు చేస్తామని మర్యాద పూర్వకంగా విత్ డ్రా చేసుకోవాలని చెప్పడం గర్హనీయమన్నారు. ఈ విషయంపై కలెక్టర్‌కు సాయంత్రం అడగగా కలెక్టర్ కూడా స్పందించకపోవడం విస్మయానికి గురి చేసిందన్నారు. రాత్రి 9 గంటల ప్రాంతంలో కలెక్టర్, రిటర్నింగ్, ఇతర అధికారులు కాంగ్రెస్ అభ్యర్థి వైష్ణవిని ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఎన్నికల కోడ్, నియమాలు పాటించని ఎన్నికల అధికారులు, ఎస్‌ఐపై న్యాయం పోరాటం చేస్తామని, కోర్టులో తేల్చుకుంటామన్నారు. అనంతరం బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు విజిత్‌రావు మాట్లాడుతూ నామినేషన్ జాబితాలో వైష్ణవి పేరు లేకున్నా ఆమెను సర్పంచుగా ప్రకటించడం ఏమిటని, ప్రజాస్వామ్యాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కూనీ చేస్తుందని ఆరోపించారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు సత్యం, నస్పూర్ పట్టణాధ్యక్షుడు అటుకూరి సుబ్బన్న, నాయకులు రవీందర్‌రెడ్డి, తిరుపతి, అత్తి సరోజ, నరేష్, పవన్, కుమార్, కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు

రెడ్‌క్రాస్‌తో అనేక మందికి ఆపన్నహస్తం


రక్తనిధి కేంద్రం సిబ్బందికి బహుమతులు అందిస్తున్న మధుసూదన్‌రెడ్డి

మంచిర్యాల కలెక్టరేట్ డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సంస్థ అనేక మందికి ఆపన్నహస్తం అందిస్తుందని సంస్థ సభ్యుడు మధుసూదన్‌రెడ్డి తెలిపారు. రెడ్‌క్రాస్‌సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రక్తనిధి కేంద్రం 17వ వార్షికోత్సవాన్ని జిల్లా కేంద్రంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలో మంచిర్యాల లోని ప్రభుత్వ ఆసుపత్రిలో మొదటిసారిగా 2008లో ప్రారంభించామన్నారు. గర్భిణులకు, తలసేమియా సికిల్‌సెల్ వ్యాధి గ్రస్తులకు, రోడ్డు ప్రమాదాలకు గురైన వారికి 17 ఏళ్లుగా రక్తాన్ని అందిస్తున్నామన్నారు. అనంతరం రక్తనిధి కేంద్రం వైద్యులు, సిబ్బందికి బహుమతులు అందించారు. రక్తనిధి కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.